

ఉష్ణోగ్రత (అంచనా) 3-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	40	28
బాపట్ల	39	28
రెంటచింతల	40	28
చీరాల	39	29



చైర్మన్‌గా ఎన్నికైన మదార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్డీవో మురళి

మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా
మదార్‌సాహెబ్

- వైస్ చైర్ పర్సన్‌గా సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న కౌన్సిల్

మాచర్లటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపల్ పూర్తిస్థాయి అధికారిక చైర్మన్‌గా 27వ వార్డు కౌన్సిలర్ షేక్ మదార్‌సాహెబ్‌ను, వైస్ చైర్ పర్సన్‌గా 10వ వార్డు కౌన్సిలర్ యర్రాకుల సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్‌ను కౌన్సిల్ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన ఈ ఎన్నికకు గురజాల ఆర్డీవో మురళీకృష్ణ రిటర్నింగ్ అధికారిగా పాల్గొనగా జిల్లా అటవీశాఖాధికారి కృష్ణప్రియ అబ్జ ర్వర్‌గా వ్యవహరించారు. 27వ వార్డు కౌన్సిలర్ మదార్‌సాహెబ్ చైర్మన్‌గా 17వ వార్డు కౌన్సిలర్ పో లూరి నరసింహారావు ప్రతిపాదించారు. 21వ వార్డు కౌన్సిలర్ జవిశెట్టి శ్రీనివాసరావు, 29వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే సుభానిలు బలపరిచారు. అలాగే వైస్ చైర్ పర్సన్‌గా పదో వార్డుకు చెందిన కౌన్సిలర్ యర్రాకుల సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్‌ను 29వ వార్డు కౌన్సిలర్ సుబాని ప్రతిపాదించగా 18వ వార్డు కౌన్సిలర్ మాచర్ల చిన ఏసోబు, 26వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే రెహనా బలపరిచారు. మొత్తం 31 మంది కౌన్సిల్ సభ్యులకు గాను 17 మంది కౌన్సిలర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. కౌన్సిల్ సభ్యుల మూజువాణి ఆమోదంతో చైర్మన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్ పర్సన్‌లతో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కూటమి నేతలు యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొమెర దుర్గారావులు వీరిని సన్మానించారు.

పోలీసుల అదుపులో క్షురకుడు..?

మాచర్లటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గంలో జరిగిన జంట హత్యల కేసులో నిందితుల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన ఓ క్షురకుడి ఖాతాలో పెద్ద మొత్తంలో నగదు జమ కావడం గుర్తించారు. దీంతో ఆ యువకుడ్ని పోలీసులు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో తోట చంద్రయ్య హత్య ఘటనలో ప్రధాన నిందితుడికి అతను అత్యంత సన్నిహితుడు కావడం విశేషం. బ్యాంకు ఖాతాల తనిఖీల్లో క్షురకుడి ఖాతాలో నగదు జమ అయినట్లు గుర్తించారని సమాచారం. ఇలా గుండ్లపాడు జంట హత్య కేసు అనేక మలుపులు తిరుగుతోంది.

5న 'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి


- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

నరసరావుపేట కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 5న స్థానిక డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం వేదికగా నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో యోగాంధ్ర మాసోత్సవంపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదివేల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. 4న జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ వద్ద వెయ్యి మందితో సామూహిక యోగా నిర్వహిస్తామని చెప్పారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ల కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు యోగా పట్ల అవగాహన కల్పించాలని, ప్రతి ఉదయం గ్రామ, వార్డు సచివాలయాల వద్ద స్థానికులతో సామూహిక యోగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.



యోగ వ్యవసాయ శాఖ అధికారులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం




రానున్న వర్షాకాలంలో జిల్లాలో సీజనల్, అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట మురళి అధికారులను ఆదేశించారు. వారం రోజుల పాటు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయితీ అధికారిని ఆదేశించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం కావాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కాగా, యోగాంధ్రలో భాగంగా ఉదయం పల్నాడు రోడ్డులో వ్యవసాయశాఖ అధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 150 మంది వరకు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుడు ఇప్పుడూ సమిధలు వారే!

పల్నాడు జిల్లా ఫ్యాక్షన్

గ్రామాల్లో అటు వైసీసీ ప్రభుత్వంలో.. ఇటు కూటమి ప్రభుత్వంలో బాధితులు, సమిధలు టీడీపీ కార్యకర్తలే. అప్పుడు వైసీసీ నేతలు అధికారం చలాయిస్తే.. ఇప్పుడు అనధికారికంగా పోలీసు అధికారులను అడ్డుపెట్టుకుని వారే తమ ఆధిప త్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కేసులున్నా తప్పించు కుంటున్నారు.. టీడీపీలో కోవర్టులతో తమ వ్యతిరేక వర్గాలను తప్పిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడాది అవుతున్నా.. పిన్నెల్లి సోదరుల పిడికెట్లోనే అరాచకాలు కొనసాగుతున్నాయి.

- ప్రభుత్వం మారినా.. అధికారం వారిదే!
- అధికారంలో ఉన్నా.. హతులు టీడీపీ వారే
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే పోలీస్ యంత్రాంగం
- చీమ చిటుక్కుమన్నా ఆ పార్టీ నేతలకు సమాచారం
- నాటి హత్యలు, అనుమానాస్పద మరణాలపై విచారణలేవీ?
- ఫ్యాక్షన్ గ్రామాల్లో నేటికీ భయం గుప్పిట్లో టీడీపీ శ్రేణులు
- ఫ్యాక్షనిస్టులను తలపించేలా అప్పట్లో పోలీసుల వ్యవహారం
- సమగ్ర విచారణ జరిపితే సగం మంది పోలీసులు ఇంటికే



గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో గడిచిన పదేళ్ల టీడీపీ శ్రేణులు దిన దిన గండం.. నూరేళ్ల ఆయుష్షు అన్నట్లు కాలం గడిపారు. రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వంలోనూ మాచర్ల ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఆ ఐదేళ్లూ.. ఆయన అరాచకాలకు అప్పటి ప్రభుత్వం కళ్లెం వేయలేక పోయింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పిన్నెల్లి సోదరులు మరింతగా రెచ్చిపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భారీ ఘన విజయంతో కొలువుదీరింది. మాచర్ల ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే కావడంతో టీడీపీ శ్రేణులకు మంచి రోజులు వచ్చాయని భావించారు. కానీ, నియోజకవర్గంలో పోలీస్ శాఖలో పెద్దగా మార్పు లేదు. నేటికీ వైసీపీ నాయకుల కనుసన్నల్లో పోలీస్ యంత్రాంగం పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడ చీమ చిటుక్కుమన్నా వైసీపీ నాయకులకు తెలిసిపోతోందని, పోలీస్ అధికారులు, సిబ్బంది కూడా వారికి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుపై టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

నాటి అరాచకాలపై చర్యలేవి?

వైసీపీ 2019లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతోనే.. పల్నాడులో అరాచకాలకు తెగబడింది. ఎంతో మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులు గ్రామాలు వదిలి వెళ్లిపోయారు. ఆత్మకూరు టీడీపీ శ్రేణులను గ్రామ బహిష్కరణ చేయడం సంచలనం సృష్టించింది. అప్పట్లో చంద్రబాబు ఛలో ఆత్మకూరుకు పిలుపునివ్వగా అధికార పార్టీ ఆదేశాలతో పోలీసులు ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. చివరకు ఆయన ఇంటి గేటుకు తాళాలు వేసి నిర్బంధం అమలు చేశారు. చివరకు విజయవాడకు చెందిన టీడీపీ నేతలు బుద్ధా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది పారా కిశోర్‌లపై వైసీపీ నేత, పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ చేసిన హత్యాయత్నం.. పల్నాడులో నెలకొన్న దారుణ పరిస్థితులను బాహ్య ప్రపంచానికి చాటిచెప్పింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిలో 12 కేసుల్లో బెయిల్ తెచ్చుకునే వరకు కూడా పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయకపోవడం పల్నాడు పోలీసుల పని తీరును ప్రశ్నిస్తోంది.

హత్యకు ముందు ఓ ఎస్సై రెక్కీ

తోట చంద్రయ్య హత్య కుట్రలో ఓ ఎస్సై పాత్ర కూడా ఉన్నట్లు తెలిసింది. హత్యకు (మిగతా 8వ పేజీలో)

తోట చంద్రయ్య హత్యలో పోలీసు కుట్ర

వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన తోట చంద్రయ్యను 2022 జనవరి 13న వైసీపీ గూండాలు అత్యంత దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. జై జగన్ అంటే ప్రాణాలతో వదిలేస్తామని వైసీపీ రౌడీలు చంద్ర య్య గొంతు పై కత్తి పెట్టినప్పటికీ.. జై చంద్రబాబు అనడంతో దారుణంగా హతమార్చారు. చంద్రయ్య అంత్య క్రియలకు హాజరైన నాటి ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆయన పాడె మోశారు. పార్టీ కార్య కర్తల్లో భరోసా నింపడానికి ప్రయ త్నించారు. చంద్రయ్య హత్యకేసు విచా రణను గత ప్రభుత్వంలో తూతూ మంత్రంగా చేపట్టారు. ఈ హత్య వె నుక కుట్రలు, కుతంత్రాలతో పాటు నే టికీ బహిర్గతం కాని పోలీసుల ప్రత్యక్ష పాత్ర ఉండటం కలకలం రేపుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రయ్య హత్య కేసులో పిన్నెల్లి బ్రదర్స్ పాత్ర ఉందని గుర్తించి, వారిని కూడా నిందితుల జాబితాలో చేర్చి, కేసును సీఐడీకి బదిలీ చేశారు.



చంద్రయ్యను హత్య చేస్తున్న వైసీపీ నేతలు (పాత చిత్రం)

బీటీ.. రాష్ట్రం దాటి!

- నిషేధిత బీటీ-3 పత్తి విత్తన విక్రయాలు
- గుంటూరులో తయారీ.. తెలంగాణలో అమ్మకాలు
- మహబూబ్‌నగర్‌లో పట్టుబడుతున్న వైనం
- ఇక్కడ ప్యాకెట్ రూ.600, అక్కడ రూ. 1,500 విక్రయం
- మామూళ్ల మత్తులో వ్యవసాయశాఖ
- తనిఖీలు ఉండవు.. కేసులు లేవు



గుంటూరు

నకిలీ, నిషేధిత విత్తనాల ప్రాభవం రాష్ట్రాలను దాటిపోతోంది. మొలవని, మొలిచినా కాపునకు రాని విత్తనాలతో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులను గుల్ల చేసిన వ్యాపారుల సామ్రాజ్యం తెలంగాణకూ విస్తరించింది. ఇక్కడ తయారు చేసిన బీటీ-3 పత్తి విత్తనాలను రాష్ట్ర సరిహద్దులోని జిల్లాలకు తరలించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా మరిపెడ మండలం గుండెపూడిలో గుంటూరు జిల్లాకు చెందిన బీటీ-3 విత్తనాల డంపు పట్టుపడడం కలకలం రేపుతోంది.

గుంటూరు సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గుండెపూడిలో పట్టుబడిన బీటీ-3 విత్తనాలను గుంటూరు నుంచి తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నట్లు సురేష్ అనే వ్యాపారి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. అక్కడ జరిపిన విచారణలో చాలా విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. నల్గొండ జిల్లాకు కూడా ఎక్కువ మొత్తంలో బీటీ-3 నిల్వలు గుంటూరు నుంచి వెళ్లినట్లు సమాచారం. వాస్తవానికి బీటీ-3 వినియోగంపై ప్రభుత్వ నిషేధం ఉంది. వాటి వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుంది.

ఆటోనగర్ నుంచి లాంచెస్టర్ వరకు..

గుంటూరు నగర పరిధిలోని ఆటోనగర్, లాంచెస్టర్ రోడ్డులో కొన్ని విత్తన కంపెనీలు, డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీ లు ఉన్నాయి. అక్కడ కొన్ని రకాల పత్తి విత్తనాలు ప్రాసెసింగ్ పేరుతో యాథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అనుమతి లేని విత్తనాలు కూడా అక్కడ ప్రాసెసింగ్ జరుగుతోంది. ముఖ్యంగా బీటీ-3 తయారీ ఈ ప్రాంతంలోనే ఎక్కువగా జరుగుతోంది. అక్కడ ఎవరు బీటీ-3 విత్తనాలు.. ఎవరు నకిలీ విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్నారో వ్యవసాయ శాఖ దగ్గర కచ్చితమైన సమాచారం ఉంది. అక్కడ తయారు చేసిన బీటీ-3 విత్తనాలు (మిగతా 8వ పేజీలో)

నమూనాలు తీస్తే ఒట్టు

నగర పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ సంస్థలు, అమ్మకాలు జరిపే వారి నుంచి ప్రతి ఏడాది ఇన్ని నమూనాలు తీయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. కానీ ఏ ఒక్క విభాగం లోనూ లక్ష్యానికి అనుగుణంగా నమూనాలు సేకరించలేదు. అయినా సదరు అధికారులపై చర్యలూ తీసుకోలేదు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా

ప్రజారోగ్యానికే ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- రూ. 90 లక్షల జెడ్పీ నిధులు మంజూరు
- జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం

సత్తెనపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లిలోని టీడీపీ ప్రజా వేదికలో సోమవారం 81 మంది లబ్ధిదారులకు రూ 65,29,350 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజక వర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 81 మంది లబ్ధిదారులకు చెక్కులను ఒకేసారి అందించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దీనికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో తాము అధికారం చేపట్టిన నాటి నుంచి సంవత్సర కాలంలో నియోజకవర్గంలో రూ 25 కోట్లతో అభివృద్ధి పనులు చేయటం జరిగిం దన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సత్తెనపల్లి పట్టణంలో కోర్టు నూతన భవనాల నిర్మాణానికి రెండున్నర ఎకరాలు జిల్లా పరిషత్ స్థలాన్ని కేటాయించినందుకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సత్తెనపల్లి నియోజక వర్గంలో అభివృద్ధి పనులకు రూ 90 లక్షలు జెడ్పీ నిధులు మంజూరయ్యాయన్నారు. స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే జిల్లా పరిషత్‌కు ఆదాయం కూడా వస్తుందని జడ్పీ చైర్‌పర్సన్‌కు తెలియ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగు తున్నాయన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు పట్టణంలోని జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్‌లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పరిశీలిస్తామన్నారు. కోర్టు భవనాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినాను టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

సమాజ హితమే లక్ష్యం

- లక్ష్య సాధన కోసం అకుంఠిత దీక్ష
- జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్ల మనోగతం

గుంటూరు (విద్య) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధన కోసం అకుంఠిత దీక్షతో కృషి చేశారు. జాతీయ స్థాయిలో లక్షల మంది పోటీ పడే పరీక్షల్లో తమ సత్తా చాటి.. అత్యున్నత ర్యాంకులు సాధించారు. సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించి తమ కలల్ని సాకారం చేసుకునేందుకు తొలి అడుగు వేయనున్నారు. సాంకేతిక విద్యలో అగ్రగామి ఐఐటీల్లో చేరనున్నారు. జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లను "ఆంధ్రజ్యోతి" పలకరించింది.



ఎస్.వెంకట సాయి చక్రి

సైబర్ నేరాలకు అడ్డుకట్ట


సైబర్ సెక్యూరిటీలో నైపుణ్యం సాధించి నేరాలకు అడ్డు కట్ట వేయడమే లక్ష్యమని జేఈఈ అడ్వాన్స్‌లో 33 ర్యాంకు సాధించిన ఎస్.వెంకట సాయి చక్రి వెల్లడించారు. ముంబై ఐఐటీలో సీఎస్‌సీ పూర్తి చేస్తానని తెలిపారు. అనంతరం సైబర్ సెక్యూరిటీ పై పరిశోధన చేయనున్నట్లు వివరించారు. ర్యాంకు సాధన కోసం తల్లిదండ్రులు సుజాతా శ్రీరామూర్తి, అధ్యాపకులు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపకరించాయని తెలిపారు.

ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు



ఎం.శ్రీకరగణేష్

జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని 104వ ర్యాంకు సాధించిన ఎం శ్రీకర్ గణేష్ తెలిపారు. తాను బెంగళూరులోని ఐఐఎస్‌లో బీటెక్ పూర్తి చేసి పరిశోధనల వైపు వెళ్లడమే (మిగతా 8వ పేజీలో)



రేణుక, డీఈవో,గుంటూరు

మెగా డీఎస్సీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 14 కేంద్రాలు ఏర్పాటు
- ఒక్కో కేంద్రంలో సగటున రెండు వందల మందికి పరీక్ష
- క్యాడర్‌వారీగా నెలరోజుల పాటు జరగనున్న ఆన్‌లైన్ పరీక్షలు

6



గ్రేట్‌గా పంచాయతీలు

- బలోపేతానికి ముందడుగు
- స్పెషల్ గ్రేడు, గ్రేడు - 1, 2, 3గా వర్గీకరణ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు..
- పూర్తికావొచ్చిన కసరత్తు
- మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సత్వర పౌర సేవలు

8

ప్రమాదానికి ముందే.. ప్రతిస్పందించాలి

- ముందున్న కొవిడ్ ముప్పు
- మరమ్మతుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు



బావిలో పడి బీటెక్ విద్యార్థి మృతి



పమిడి పవన్ కుమార్(ఫైల్)

నూజెండ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని తంగిరాల గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పమిడి ఏడుకొండలు కుమారుడు పమిడి పవన్ కుమార్(21) గుంటూరులో బీటెక్ చదువుతూ సెలవులకు ఇంటికి వచ్చాడు. ఉదయం గ్రామం పక్కనే ఉన్న జామాయిల్ తోటకు కాపలాగా వెళ్లి.. పొలంలో ఉన్న బావిలో ప్రమాద వశాత్తు పడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన నాయనమ్మ సుబ్బులు కేకలు వేయడంతో గ్రామస్తులు వెళ్లి రక్షించేందుకు ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. దీంతో ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్‌లతో 25 అడుగుల లోతు ఉన్న నీటిని తోడించి, మృత దేహాన్ని బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బీవీ కృష్ణారావు పరిశీలించి, మృత దేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కుమారుడి అకాల మృతితో తల్లిదండ్రులు, ఏడుకొండలు, నాగరాజ రోదిస్తున్నారు.

శుద్దపల్లిలో దారుణహత్య



కొమ్మూరి గోపయ్య (ఫైల్)

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం శుద్దపల్లి గ్రామంలో తాపీ మేస్త్రీ కొమ్మూరి గోపయ్య(35) హత్య సంచలనంగా మారింది. చేబ్రోలు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం శుద్దపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరి గోపయ్య అలియాస్ గోపీ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. సోమవారం శుద్దపల్లి గ్రామంలోనే గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో విచక్షణ రహితంగా గోపయ్య పై దాడి చేయడంతో అతను అక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో గోపయ్యను గుర్తించిన స్థానికులు చేబ్రోలు పోలీసులకు సమాచారం అందించారు. పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ వెంకట కృష్ణ ఘటన స్థలానికి చేరుకుని మృతుడి తల్లి కొమ్మూరి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

వివాహేతర సంబంధంపై అనుమానం..

గోపయ్య భార్యతో విభేదాల కారణంగా చేబ్రోలులో నివసిస్తున్నాడు. చేబ్రోలుకు చెందిన మరో తాపీ మేస్త్రీతో గోపయ్య కర్నూల్‌లో టాపీ పనులకు వెళ్లారు. తిరిగొస్తూ ఒక మహిళను కూడా చేబ్రోలు తీసుకువచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. చేబ్రోలు తాపీ మేస్త్రీ సదరు మహిళతో సహజీవనం చేస్తుండగా వారం రోజుల క్రితం కనిపించకుండా పోయింది. గోపయ్య ఆ మహిళను తీసుకువెళ్లి దాచాడని అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వివాదం చెలరేగింది. గోపయ్య హత్యపై పలు కోణాలలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీ మృతికి పోలీసులకు సంబంధం లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దనరావు

అవాస్తవాలను ప్రజలు నమ్మొద్దు! డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్, జూన్2(ఆంధ్రజ్యోతి): తెనాలిలో బంగారు బట్టి నిర్వాహకుడు సిద్ధేష్ శివాజీ ఆత్మహత్యకు పోలీసుల వేధింపులే కారణమంటూ కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని డీఎస్పీ జనార్దనరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిద్ధేష్ శివాజీ ఆత్మహత్యకు పోలీసుల వేధింపులే కారణమంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. గత నెల 22న తెనాలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎం జ్యూయలర్స్ అధినేత రమేష్ అనే వ్యక్తి వచ్చి తన దగ్గర స్టాక్ మేనేజర్‌గా పనిచేసే అనిల్‌కుమార్ జైన్.. మోసగించి సుమారు కేజీ బంగారం దొంగిలించాడని ఫిర్యాదు చేశారుని చెప్పారు. దార్యాప్తులో భాగంగా అనిల్‌కుమార్ జైన్ తన వద్ద కొంత బంగారం ఉందని ఒప్పుకున్నాడని తెలిపారు. ఆ బంగారాన్ని రికవరీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన బంగారం గురించి అడగగా తనకు మరి కొంత మందికి అమ్మినట్లు చెప్పాడని పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా తెనాలి త్రీ టౌన్ ఎస్ఐ ప్రకాష్‌రావుని అధికారిగా బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. గత నెల 31న సాయంత్రం నిందితుడు చెప్పినదాని ప్రకారం సిద్ధేష్ శివాజిని బంగారం బట్టి వ్యాపారానికి సంబంధించిన వాళ్ల అసోసియేషన్ పెద్దలతో కలిసి పిలిపించడం జరిగింది. వారి సమక్షంలో విచారించగా అనిల్ కుమార్ జైన్ అతనికి 100 గ్రాములు బంగారం అమ్మినట్లుగా చెప్పాడన్నారు. అసోసియేషన్ పెద్దలు, బంధువులు కొంత సమయం కావాలని కోరడంతో.. ఎస్ఐ అంగీకరించి అతడిని పంపించినట్లు తెలిపారు. ఆ మరుసటి రోజు ఉదయం వారి ఇంట్లో సిద్ధేష్ శివాజీ ఉరి వేసుకోని చనిపోయాడని, విషయాన్ని పోలీసులకు తెలపకుండా తల్లిదండ్రులు, బంధువులు కలిసి వారి స్వగ్రామమైన మహారాష్ట్రకి మృతదేహాన్ని తీసుకువెళ్లిపోయినట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై కొన్ని వార్తపత్రికల్లో, సోషల్ మీడియాల్లో తెనాలి పట్టణ సీఐలు వారిని మానసికంగా శారీరకంగా వేధించారని అసత్య కథనాలు రాశారని, ఇందులో పోలీసుల ప్రమేయం ఏ మాత్రం లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ ప్రతిష్టను దెబ్బతీసేలా కొన్ని న్యూస్ పేపర్లు అర్థాన్ని వక్రీకరించి సూసైడ్ నోట్లో పోలీస్‌ల తప్పు ఉన్నట్లుగా రాయడం సమంజసం కాదన్నారు. వన్‌టౌన్ సీఐ మల్లిఖార్జున రావు, రూరల్ ఎస్ఐ ఆనంద్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ వర్గాలను రెచ్చగొట్టడానికే జగన్ పర్యటన

● ఆలపాటి, ప్రత్తిపాటి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్2 (ఆంధ్రజ్యోతి): జగన్ తెనాలి పర్యటనకు వచ్చేముందు కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, ఆయన తన పార్టీ కార్యకర్తల పరామర్శకు వస్తున్నాడా లేక నేరస్తులతో ములాఖత్ అవ్వడానికి వస్తున్నాడో చెప్పాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం డిమాండ్ చేశారు. స్థానిక ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆయన మాట్లాడారు. కల్తీమద్యం, గంజాయి, డ్రగ్స్ అమ్మేవారికి మద్ధతిస్తున్న జగన్ వైఖరి చూస్తుంటే, మరలా ఆయన తన పాత నేర స్వభావాన్ని బయటపెట్టే ప్రయత్నం చేస్తున్నాడేమో అన్న సందేహం ప్రజలకు కలుగుతోందన్నారు. జగన్ పరామర్శించబోతున్న జాన్ విక్టర్ 2017 నుంచి వివిధ నేరాల్లో ముద్దాయిగా ఉండి, పదుల కొద్దీ కేసులు నమోదైన మాట వాస్తవం కాదా అని ఆలపాటి ప్రశ్నించారు. దోమా రమేశ్ అనే మరో నిందితుడు కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం కేసుల్లో ముద్దాయని, కరిముల్లా అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్ పై దాడిచేసిన కేసులో ముద్దాయని తెలిపారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే డ్రామాలు..

కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాలను వెలికితీస్తోందన్న భయంతో ప్రజల దృష్టి వాటిపై నుంచి మళ్లించడానికే జగన్ వెన్నుపోటు దినం పేరుతో డ్రామాలు ప్రారంభించాడని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత జగన్ ఇస్తున్న పిలుపులకు ప్రజా స్పందన శూన్యమన్నారు. జగన్ దోపిడీకి, అరాచకపాలన చేసిన వైసీపీనేతలతో పాటు వారికి సహకరించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా జైలుకువెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లకు భాష్యం చేయూత

● ఉన్నత చదువులకు రూ. 16 లక్షల పంపిణీ



33వ ర్యాంకర్‌కు నగదు చెక్కు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు భాష్యం విద్యా సంస్థలు చేయూత అందించాయి. జాతీయ స్థాయిలో 152వ ర్యాంకర్ జి.సాయిమనోజ్ఞకు రూ.5 లక్షలు, 33వ ర్యాంకర్ ఎస్.వెంకటసాయి చక్రికి రూ.5లక్షలు, 104వ ర్యాంకర్ శ్రీకర గణేష్, 108 ర్యాంకర్ ఎన్. ఆకాష్ తదితరులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, 146, 151 ర్యాంకర్లు టి. విక్రమ్ లెవీ, డి. జస్వంత్ బాలాజీకి రూ. లక్ష చొప్పున అందజేశారు. విద్యార్థుల ఉన్నత చదువు కోసం ఈ మొత్తాలను భాష్యం ఐఐటి జేఈఈ అకాడమి అందిస్తున్నట్లు భాష్యం రామకృష్ణ వెల్లడించారు.

ర్యాంకర్లతో సంబరాలు

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఆధ్వర్యంలో భాష్యం మెయిన్ క్యాంపస్‌లో సంబరాలు నిర్వహించారు. భారీ కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

జడ్పీలో ముగిసిన బదిలీలు



జడ్పీలో జరిగిన ఉద్యోగుల కౌన్సిలింగ్ ప్రక్రియలో పాల్గొన్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈఓ జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పాల్గొన్నారు. బదిలీల ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు మాట్లాడుతూ ఒక ఊరిలో ఐదేళ్ల విధులు నిర్వహిస్తే తప్పనిసరిగా బదిలీ ఉంటుందన్నారు. ఎక్కడైనా ఖాళీలు ఉంటే ఆ ప్రాంతానికి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామన్నారు. జడ్పీ పరిధిలో 91 మందికి స్థానచలనం కలిగింది. వీరిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ 7, సీనియర్ అసిస్టెంట్లు 8, జూనియర్ అసిస్టెంట్లు 17, టైపిస్టులు 9, రికార్డ్ అసిస్టెంట్లు 8, ల్యాబ్ అసిస్టెంట్లు 2, ఆఫీస్ సబార్డినేట్లు 39, నైట్ వాచ్‌మన్ ఒకరు బదిలీ అయ్యారు. డిప్యూటీ సీఈవో కృష్ణ, అకౌంట్ ఆఫీసర్ సామ్యూల్ పాల్, ఏవో రాజరత్నం బాబు పాల్గొన్నారు.


చదువుకోవాలని ఉంది.. ఇప్పుడే పెళ్లి వద్దు!

ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాలిక

గుంటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'ప్లీజ్... నాకు చదువుకోవాలని ఉంది. ఇప్పుడే పెళ్లి చేసుకోను.' అంటూ ఓ మైనర్ బాలిక సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. బాలిక కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్లమూడి గ్రామానికి చెందిన దంపతులకు కుమార్తె జన్మించిన తొమ్మిదేళ్లకు కుమారుడు జన్మించాడు. అప్పటి వరకు కుమార్తెను ప్రేమగా చూసు కున్న తల్లిదండ్రులు కుమారుడు జన్మించినప్పటి నుంచి కూతురు పట్ల వివక్ష చూపడం ప్రారంభించారు. పదో తరగతి పరీక్షలు రాసిన తర్వాత పాలిసెట్ కూడా రాయమని తల్లిదండ్రులు కోరగా తనకు ఇష్టం లేదని బాలిక చెప్పింది. అయినప్పటికీ తల్లిదండ్రులు బలవంతంగా ఆమెతో పాలిసెట్ రాయించారు. అందులో సరైన ర్యాంకు రాక పోవడంతో అప్పటి నుంచి వారు కుమార్తెపై ద్వేషం పెంచుకోవడమే కాకుండా.. ఇంటి నుంచి బయటకు గెంటి వేశారు. దీంతో బాలిక గుంటూరులోని అరండల్ పేటలో ఉన్న తన బాబాయి ఇంటికి వచ్చింది. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికకు 520 మార్కులు వచ్చాయి. కానీ, మార్కులు తక్కువ వచ్చాయని, పైచదువులు చదవాల్సిన అవసరం లేదని, ఇంటిలో పనులు నేర్చుకుంటే పెళ్లి చేస్తామని తల్లిదండ్రులు అంటున్నారని బాధిత బాలిక వాపోయింది. పది రోజుల క్రితం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు వంటివి ఇవ్వాలని ఫోన్ చేసి అడిగితే వాటిని ఇచ్చేది లేదని తల్లిదండ్రులు చెప్పారని పేర్కొంది. స్కూల్ మేనేజ్‌మెంట్‌కు ఫోన్ చేసి పదవ తరగతి సర్టిఫికెట్లు తనకు ఇవ్వొద్దని చెప్పారని తెలిపింది. తనకు చదువుకోవాలని ఉందని, అందుకు తల్లిదండ్రులు ఆటంకం కల్పించకుండా న్యాయం చేయాలని బాలిక ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులను వేడుకుంది. ప్రస్తుతం బాలిక అరండల్‌పేటలో ఉంటున్న నేపథ్యంలో అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసు అధికారులు సూచించారు.

79 మంది ఉద్యోగాలకు ఎంపిక

నరసరావుపేట రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ కాగ్నిజెంట్ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ సోమవారం కళాశాల ఆవరణలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కళాశాలకు చెందిన 79 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎన్ఈసీ చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

మెగా డీఎస్సీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

డీఈఓ సీవీ రేణుక

గుంటూరు (విద్య) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో మెగా డీఎస్సీ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు. మొత్తం 14 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించి ఎన్నారై ఇంజనీరింగ్ కాలేజ్, కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, కిట్స్ అక్షర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కళ్ళం హరినాథ్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్, సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కాలేజ్, సెయింట్ మేరీస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ గుంటూరు, కేఎల్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తదితర కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అం డ్ టెక్నాలజీలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లాకు సంబంధించి తిరుమల, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలు తదితర కేంద్రాలు ఏర్పాటు చేశారు. మెగా డీఎస్సీ పరీక్ష విడతల వారీగా దాదాపు నెల రోజులపాటు కొనసాగుతుంది. పరీక్ష కోసం ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, పండిట్స్ విభాగాల్లో టీచర్ పోస్టుల కోసం 43,611 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని డీఈఓ రేణుక తెలిపారు.

ప్రజలను వైసీపీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



నరసరావుపేట టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచి ఘోరంగా ఓడిపోయిందని, ఆ సంగతిని మరచి ఈ నెల 4న ప్రజా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వెన్నుపోటు దినంగా నిరసన తెలుపుతామని చెప్పడం సిగ్గుచేటని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో కొమ్మాలపాటి మాట్లాడుతూ పేదల పింఛను పెంచడానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఐదేళ్ల పట్టిందని, రాష్ట్రాన్ని ఆర్థిక, అభివృద్ధిని విధ్వంసకర దుస్థితిలోకి చేర్చిన ఘనత వైసీపీదేనన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు విడుదల చేయడంలో ఆలస్యమవడంతోనే అన్నదాత సుఖీభవ పథకం జాప్యమైందని తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభానికి ఒక రోజు ముందే తల్లికి వందనం కింద రూ.15 వేలు తల్లులకు అందజేస్తామన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

వెన్నుపోటు, గొడ్డలి వేటు రాజకీయాల పేటెంట్ జగన్‌రెడ్డిదే

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు, గొడ్డలి వేటు రాజకీయాలకు పేటెంట్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ నేతలు ధర్నాలు చేస్తూ వెన్నుపోటు అంటూ అరవటం దొంగే దొంగ అన్నట్లుందన్నారు. కాంగ్రెస్‌కు ద్రోహం చేసి వైసీపీని స్థాపించిన రాజకీయ చరిత్ర జగన్‌రెడ్డిదేనన్నారు. బాబాయిని హత్య చేయించి రాజకీయంగా అడ్డు తొలగించేందుకు కుట్ర చేశారన్నారు. తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటివేసి కుటుంబవ్యవస్థను జగన్ అపహాస్యం చేశారన్నారు. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. మద్య నిషేధం పేరుతో విషపూరిత మద్యం పోసి పేదల జీవితాలతో చెలగాటమాడారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 70 శాతం హామీలను అమలు చేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికైనా నాటకాలను మానుకోవాలన్నారు. చంద్రబాబు నేతృత్వంలో న్యాయబద్ధమైన పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు.

మరకత లింగ చంద్రమౌళేశ్వరునికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో మరకత లింగ చంద్రమౌళేశ్వరస్వామి

నకరికల్లు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నరసింగపాడులోని అయ్యప్ప సహిత గంగా అన్నపూర్ణా దేవి సమేత మరకత చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో 8వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీ పారాయణం, రుద్ర హోమం నిర్వహించారు. అమ్మవారికి జరిగిన కుంకుమార్చనల్లో మహిళలు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పమిడిమర్రు శ్రీనివాస శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

దేవాలయ భూములకు బహిరంగ కౌలు వేలం

బెల్లంకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గల దేవాలయ భూముల బహిరంగ కౌలు వేలం ఈనెల 4వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు బెల్లంకొండ మండల దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి అవుదూరి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కందిపాడు గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి వార్ల దేవాలయ భూములను, కోదండరామ స్వామి దేవాలయం, వన్నాయపాలెం గ్రామంలో ఆంజనేయ స్వామి దేవస్థానం, రామలింగేశ్వరస్వామి దేవస్థాన భూములకు అదేరోజు వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 5వ తేదీన వెంటాయపాలెం గ్రామంలోగల పెదసింగరస్వామి, చిన సింగరస్వామి దేవస్థాన భూములు, పాపాయపాలెంలో గల వేణుగోపాలస్వామి దేవస్థాన భూములు, కామేపల్లి గ్రామంలో వరద వేణుగోపాలస్వామి దేవస్థాన భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 6వ తేదీన గంగిరెడ్డిపాలెం గ్రామంలో గాయత్రి పంచాయతన్ ఆశ్రమం, మల్లేశ్వరస్వామి దేవస్థానం, బెల్లంకొండ గ్రామంలో వీరభద్రస్వామి దేవస్థానానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలం దక్కించుకున్నవారు ముందుగానే కౌలుచెల్లించాలని సూచించారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీసీ, పోలీసు, ఆర్టీవో అధికారులు

తొమ్మిది వాహనాల సీజ్

అచ్చంపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని తాళ్ళచెరువు అడ్డరోడ్డు వద్ద సోమవారం ఆర్టీసీ, పోలీసులు, ఆర్టీవో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 54 వాహనాలను తనిఖీ చేసి తొమ్మిది వాహనాలను సీజ్ చేశారు. వీటిలో నాలుగు ఆటోలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. మిగిలిన వాటికి రూ 54వేల అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సత్తెనపల్లి ఆర్టీసీ మేనేజర్ పాతిమా, సీఐ ఏ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ

దోమల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలి

● వైద్యాధికారులు రాంబాబు నాయక్, సిరి చందన

క్రోసూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు డాక్టర్ రాంబాబునాయక్, డాక్టర్ సిరిచందన అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం క్రోసూరులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వ్యాప్తిచెందకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎవరికైనా గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలుగాని, ఇతర వ్యాధులుగాని వస్తే వెంటనే వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ర్యాలీని ప్రధాన వీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్, సీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, స్టాఫ్ నర్సు అంజమ్మ, ఫార్మసిస్టు ఫాతిమ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలు.. విద్యార్థుల కష్టాలు


కేసానుపల్లి కేజీబీవీలో అర్ధంతరంగా నిలిచిన జూనియర్ కళాశాల భవన సముదాయం

దాచేపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నాడు - నేడు పథకంలో చేపట్టిన నిర్మాణ పనులు నిధులు లేక అర్థతరంగా నిలిచిపోయాయి. నాడు - నేడు(మన బడి మన భవిష్యత్‌గా పేరు మార్చారు) పథకం కింద దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంటర్ విద్యను కూడా అందించాలన్న లక్ష్యంగా అప్పటి ప్రభుత్వం రూ 1.04 కోట్ల నిధులు మంజూరుచేసింది. 2022 డిసెంబరులో శంకుస్థాపన జరిగిన ఈ జూనియర్ కళాశాల నిర్మాణ పనులకు నిధుల కొరత ఏర్పడటంతో నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కస్తూర్బా పాఠశాలలో గత నాలుగు సంవత్సరాల నుంచి ఇంటర్ మీడియట్ కూడా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్య పెరగడంతో వారికి సరిపడ తరగతి గదులు లేక పోవటం, భోజన వసతి, ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. సమగ్ర శిక్ష నిధుల నుంచి కేటాయించిన రూ.1.04 కోట్లు ఇంతవరకు విడుదల కాకపోవటంతో నిర్మాణ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. తరగతి గదులు విష జంతువులకు నిలయంగా మారింది. నిర్మాణానికి తెచ్చిన ఇనుము తప్పుపట్టిపోగా ఇసుక మట్టిలో కలసిపోయింది. అదేవిధంగా తంగెడలో అదనపు తరగతి గదులకు రూ.62లక్షలు కేటాయించారు. మాదినపాడులో ఉన్నత పాఠశాలలోని అదనపు తరగతి గదులకు మరో రూ.30 లక్షలు కేటాయించారు. నిధుల కేటాయింపు ఐతే హడావుడిగా చేశారేకాని వాటి మంజూరులో మాత్రం మొండిచేయి చూపారు. ఈ పరిస్థితుల్లో రానున్న విద్యా సంవత్సరానికైనా నిధులు మంజూరవుతాయా?, నిలిచిపోయిన నిర్మాణాలు పునర్నిర్మాణానికి నోచుకుంటాయా?, అని విద్యార్థులు, తల్లిదండులు, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి నిలిచిన నిర్మాణాలను పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.



కోర్టు భవనాలకు స్థలం కేటాయింపుపై హర్షం


జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాను సన్మానిస్తున్న న్యాయవాదులు

సత్తెనపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చొరవతో సత్తెనపల్లిలో కోర్టు భవనాల నిర్మాణానికి జిల్లా పరిషత్ స్థలాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా కేటాయించటంతో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న స్థల సమస్య పరిష్కారమైంది. సత్తెనపల్లిలో నాలుగు కోర్టులు ఉన్నాయి. 13 సంవత్సరాలుగా మార్కెట్‌యార్డు ఆవరణలో రెండు కోర్టులు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తాలూకాలో రెండుకోర్టులు పనిచేస్తున్నాయి. కొత్తగా కోర్టు భవనం నిర్మించి నాలుగు కోర్టులు ఒకేచోట ఉంచాలని న్యాయవాదులు పదేళ్లుగా స్థల సేకరణ కోసం రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తీసుకువెళ్ళారు. ఆయన స్పందించి నరసరావుపేట రోడ్డులో ఉన్న 2.60 ఎకరాల భూమిని స్థానిక న్యాయవాదులతో కలసి పరిశీలించారు. అనంతరం జడ్పీ చైర్మన్‌తో ఆ భూమిని కేటాయించాలని కోరారు. ఆమె స్పందించి జడ్పీ స్థలాన్ని కేటాయించారు. స్థలాన్ని కేటాయించిన జడ్పీ చైర్మన్ హెన్రీ క్రిష్టీనాకు, ఇందుకు కృషిచేసిన ఎమ్మెల్యే కన్నాకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, నాయకులు అళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, కంభాల వెంకటేశ్వరరావు, నూర్‌బాషా జాన్‌బాబు, దరువూరి నాగేశ్వరరావు, అంకాళ్ళ ప్రభుదాసు, రావిపాటి మధుబాబు, గోగినేని కోటేశ్వరరావు, అళ్ళ సాంబయ్య, కోమటినేని శోభారాణి, తోట అంబిక, కొరారు సంధ్య, వాసా వెంకటేశ్వర్లు, మందమంచి రాంబాబు, మస్తాన్‌వలి, కోట జోసెఫ్, కట్టా శంకరరావు, తవిటి భావన్నారాయణ, నియోజకవర్గ బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

గ్రంధి కుటుంబానికి కన్నా పరామర్శ

రాజుపాలెం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కూటమి నాయకుడు గ్రంధి సదాశివుడు నాయనమ్మ వెంకటకోటమ్మ రెండురోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం సదాశివుడు ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటకోటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, తోట శ్రీను, పెద్దింటి శ్రీనివాసరావు, తమటం వీరయ్య, గుర్రాల జగన్మోహన్‌రావు, ఒర్సు శ్రీను, గ్రంధి బాలాంజనేయులు, తోట వెంకట శివ, కె.వెంకట్రావు ఉన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక

నకరికల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలంలో టీడీపీ గ్రామ కమిటీలు, అనుబంధ సంఘ కమిటీలను ఏర్పాటు చేశారు. చేజర్ల, చీమలమర్రి గ్రామాల్లో ఒకటి రెండు రోజుల్లో గ్రామ కమిటీల నియామకం పూర్తి కానున్నట్టు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య తెలిపారు.

పాఠశాలల్లో మెనూ అమలుచేయాలి

నకరికల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీలు ప్రభుత్వం విడుదల చేసిన మెనూ మార్గదర్శకాలను కచ్చితంగా అమలుచేయాలని రిసోర్స్ పర్సన్ రమాదేవి ఆదేశించారు. సోమవారం నకరికల్లులో మధ్యాహ్న భోజన పథకం డొక్కా సీతమ్మ భోజన పథకం నిర్వహణ గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మేదరమెట్ల స్వామి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ చైర్మన్‌గా లావు నియామకంపై హర్షం

సత్తెనపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను ఎంపికచేయటం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎలినేడి రామస్వామి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. కృష్ణదేవరాయలు నాయకత్వంలో ఎఫ్‌సీఐ ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

అచ్చంపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో 50శాతం సబ్సిడీపై పశువుల దాణాను అందజేసినట్టు పశు సంవర్ధకశాఖ డాక్టర్ స్వాతి దేవి తెలిపారు. వేల్పూరు, కోనూరు, గ్రంధసిరి, చెరుకుంపాలెం, పుట్లగూడెం, చింతపల్లి, కొత్తపల్లి, చల్లగరిగ గ్రామాల్లో పశుదాణాను పంపిణీ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం సోమవారం నాటికి 512.20 అడుగులు ఉంది. ఇది 135.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5292 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 5742 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

పులిచింతల..

అచ్చంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 21.57 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 300 క్యూసెక్కుల నీరు లీకుల ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ వెంకటరమణ


మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరమణ

మాచర్ల రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ వెంకటరమణ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని వినాయకునిగుట్టలో ఆయన పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, చిన్నారులతో లైంగిక వేధింపులకు పాల్పడిన కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు సైదానాయక్, ఏలూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పీడ విరగడై ఏడాది..

● జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు


సమావేశంలో మాట్లాడుతున్న కటికం అంకారావు


పిడుగురాళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు, అవినీతి, భౌతిక దాడులు చేసి ప్రజల్ని నయవంచనకు గురిచేసిన వైసీపీ అనే దుష్టశక్తి పీడ విరగడై జూన్ 4కి ఏడాదైందని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు అన్నారు. సోమవారం పిగుడురాళ్లలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ఏర్పడి సంవత్సరం కావస్తున్న తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుపుకోవాలని జనసేన కేంద్ర కార్యాలయం నిర్ణయించినట్లు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు గురజాల నియోజకవర్గంలో ఈ నెల 4న సంబరాలు చేసుకోవాలని అంకారావు పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా ఉన్న సమయంలో జగన్ అండ్ కో వెన్నుపోటు దినం పేరుతో మళ్ళీ అరాచకాలు సృష్టించటానికి పథకం రచిస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి అడపా వెంకట్, జిల్లా కార్యదర్శి అంబటి మల్లి, నాయకులు బయ్యవరపు రమేష్, బి.ప్రసాద్, సలీం, జి.కోటిమల్లెల రామాంజి, ఏ సాయి, గుంటూరు శ్రీను, పవన్, సింగంశెట్టి రమణ, తోట రామదాసు తదితరులు ఉన్నారు.

ఆగి ఉన్న లారిని ఢీకొని ఒకరి మృతి

మాచర్లటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణం శివప్రియనగర్ సమీపంలోని బైపాస్ జంక్షన్ పాయింట్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయాలు పాలైన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని గోపాలపురం పెట్రోల్ బంకు వద్ద డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ప్రకాశం జిల్లా ఆవులమందకు చెందిన పాతర్ల సుధాకర్, ఎక్సకవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ప్రకాశం జిల్లా దొనకొండకు చెందిన దుగ్గల రాజశేఖరరెడ్డి హోండా వాహనంపై మాచర్ల వస్తూ జంక్షన్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సుధాకర్ (40), రాజశేఖరరెడ్డిని 108 అంబులెన్స్‌లో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుధాకర్ అప్పటికే మృతిచెందగా రాజశేఖరరెడ్డిని మెరుగైన చికిత్స కోసం తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ భూతం ప్రాణాంతకం

● పరాశక్తి సిమెంట్స్ వైస్ ప్రెసిడెంట్ రాజు


ర్యాలీని ప్రారంభిస్తున్న పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ రాజు

రెంటచింతల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ భూతం పర్యావరణానికి చేటుగా తయారైందని పరాశక్తి సిమెంట్స్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. సోమవారం నుంచి 4 రోజుల పాటు నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవాల సందర్భంగా ఉద్యోగులు, కార్మికులతో కలిసి జెండా ఊపి ర్యాలీ నిర్వహించిన అనంతరం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ మాట్లాడుతూ మొక్కల పెంపకానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుదాం.. ప్లాస్టిక్ వాడకం మానేద్దాం అని కార్మికుల నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు ఎం.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్, వేణుగోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

మాచర్లటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళ మెడలో ఉన్న నాంతాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయిన సంఘటన మాచర్లలోని రైల్వేస్టేషన్ రోడ్డు 15వ వార్డులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... స్టేషన్ రోడ్డులో కొమెర మల్లీశ్వరి(70) ఒంటరిగా జీవిస్తోంది. చీకటి పడ్డాక గదిలో వంట చేస్తుండగా ఇంట్లోకి ప్రవేశించిన యువకుడు మెడలో ఉన్న 30 గ్రాముల నాంతాడును అపహరించుకొని పారిపోయాడు. దీనివిలువ సుమారు రూ.3లక్షలు ఉంటుంది. పట్టణ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని విచారిస్తున్నారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆ బజారులో సోమవారం సాయంత్రం ఆ యువకుడు నాలుగైదు సార్లు సంచరించినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. దీనిపై పోలీసులు పరిసరాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం పశుదాణా పంపిణీ


రైతులకు పశుదాణా బ్యాగ్‌లు అందజేస్తున్న కాంద్రు కాశయ్య తదితరులు

క్రోసూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం రాయితీపై రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్నట్లు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం సబ్సిడీపై రైతులకు పశుదాణాను ఆయన పంపిణీ చేశారు. తెల్లరేషన్ కార్డుగల వారికి రైతుసేవా కేంద్రాలు, పశువైద్యశాలల్లో పశుదాణా ఇస్తారని పశు వైద్యాధికారి మల్లయ్య అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకులు ఎన్ కోటేశ్వరరావు, యోహాన్, శ్రీనివాసరావు, షేక్ సలాం, పి.రాంబాబు పాల్గొన్నారు.

గురజాలలో బుల్లెట్ వాహనం చోరీ


బుల్లెట్‌ని దొంగిలిస్తున్న దొంగలు (సీసీ టీవీ ఫుటేజీలో నమోదైన దృశ్యం)

గురజాలటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో పట్టణంలోని జయంతి స్కూల్ ఎదురుగా ఉన్న వీధిలో టీడీపీ నేత నవులూరి పుల్లారావుకు చెందిన బుల్లెట్ వాహనాన్ని ఇరువురు దొంగలు తీసుకెళ్లారు. దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు పుల్లారావు ఇంటికి ఉన్న సీసీ కెమేరాలో రికార్డయ్యాయి. దీనిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పుల్లారావు తెలిపారు.

ఎమ్మెల్యే జూలకంటికి రుణపడి ఉంటా

● మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్


వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్డీవో మురళి

మాచర్లటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా మైనార్టీ వర్గానికి అధిక ప్రాధాన్యతనిస్తూ మాచర్ల పట్టణంలో ఎంతో ఉన్నతమైన పదవిని అందించి మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి రుణపడి ఉంటామని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. కౌన్సిల్ సభ్యులు సోమవారం మాచర్ల మున్సిపల్ పూర్తి స్థాయి అధికారిక చైర్మన్‌గా మదార్ సాహెబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మదార్‌సాహెబ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జూలకంటి ఆదేశాల మేరకు మాచర్ల పట్టణ సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు పాటుపడతామని పేర్కొన్నారు.

అపరిశుభ్రతతోనే రోగాలు వ్యాప్తి

దాచేపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పరిసరాలు అపరిశుభ్రత, మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు ఉత్పత్తి చెంది రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని డాక్టర్ మధు తెలిపారు. సోమవారం జాతీయ మలేరియా మాసోత్సవాల్లో భాగంగా దోమకాటుతో వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోదకాలు గురించి వివరించారు. నీరు నిల్వ ఉండకుండా చేయాలని, దోమ తెరలు వాడాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో పట్టాభి, సీహెచ్‌వో కృష్ణకుమారి, హెచ్ఎస్ లక్ష్మయ్య, హెచ్‌వీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

నిరుపేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

దాచేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ర్యాలీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు రెడ్‌కార్పెట్ వేస్తున్నాయని, పేదలు నిరుపేదలుగా మారుతున్నారని అన్నారు. పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని, గృహాలు నిర్మించుకొనేందుకు రూ 5 లక్షలు రుణాలు ఇవ్వాలని కోరారు. సూపర్-6 పథకాలను అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొమర వెంకటరావు, పత్తిపాటి వెంకట నాగరాజు, రేవూరి రామయ్య, ఎన్ కొండలు, నాసరయ్య, సుభానీ, బాజీ, గంగారం, తెల్లనాకుల సత్యనారాయణ, ఏసోబు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వరనీరాజనం పాటల పోటీలు

మాచర్ల రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా మాచర్ల పట్టణంలో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాపరిషత్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో స్వరనీరాజనం రాష్ట్రస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ముటుకుల కమలాసన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.10 వేలను విజయవాడకు చెందిన ఎంఎస్ శివబాబు, ద్వితీయ బహుమతి రూ.7వేలను వీ ఆనందరావు, తృతీయ బహుమతి రూ.5 వేలను కేఎం నాయుడు, నాలుగో బహుమతి రూ.4 వేలను బీ కోటేశ్వరరావు, ఐదో బహుమతి రూ.3 వేలను వేజెండ్లకు చెందిన వెంకటేశ్వర్లు గెలుపొందారు. పోటీల్లో పాల్గొన్న మరో 30 మందికి రూ.1000 చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందించారు. హాజరైన మహిళలకు లక్కీడ్రాలో పదిమందికి చీరలను అందించారు. అలాగే పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమానికి పత్తిగొడుపు నరసరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, యనమదల వెంకట్రామయ్య, కళాపీఠం అధ్యక్షుడు కొత్తమాసు శ్రీరామమూర్తి, కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్‌జాన్‌ఖాన్, పులుసు శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పులిపాడులో ఉచిత వైద్య శిబిరం


గురజాలటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడులో మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపంలో గుండెకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు. గుండెదడ, గుండె నొప్పి, ఆయాసం, ఛాతిలో నొప్పి, మంట, శ్వాసలో ఇబ్బంది, షుగర్, బీపీ, ఉబ్బసం, గ్యాస్ట్రిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ఉచితంగా స్కానింగ్ చేయనున్నారు.

మద్యం మత్తులో దాడి.. ఒకరికి గాయాలు

మాచర్లటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణం 17వ వార్డు ఎరుకుల కాలనీలో మద్యం సేవించిన ముగ్గురు యువకులు మాటామాటా పెరిగి దాడి చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. మానుపాటి వెంకటకోటయ్య, మానుపాటి భీమయ్య, మానుపాటి శ్రీనాథ్‌లు మద్యం తాగారు. మత్తులో ఒకరిపై ఒకరు ఘర్షణపడ్డారు. ఈ ఘర్షణలో వెంకటకోటయ్యను శ్రీనాథ్ కర్రతో తలపై మోదాడు. తీవ్రగాయాలైన వెంకటకోటయ్యను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నరసరావుపేటకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందుతాగి చికిత్స పొందుతున్న యువకుడి మృతి

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం లేక పురుగుమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కోటా వీరబాబు(24) గత నెల 29న పురుగుమందు తాగడంతో అమరావతిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో కె.సరోజనిదేవి, టీడీపీ నేతలు

బస్ షెల్టర్ ప్రారంభం

రెంటచింతల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సోమవారం రెంటచింతలలో ముత్యాలమ్మ ఆలయం ఎదురుగా బస్ షెల్టర్‌ను ఎంపీడీవో కె.సరోజనిదేవి ప్రారంభించారు. రూ.2.50 లక్షల వ్యయంతో యరబోతుల ప్రవీణ్‌కుమార్, పవన్‌కుమార్‌లు నిర్మించిన ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కె.శ్రీకాంత్, గొంటు సుమంత్‌రెడ్డి, యరబోతుల నేతాజి, కాశీ, అనూష, డీటీ బ్రహ్మం, బోడపాటి రామకృష్ణ, టీడీపీ టౌన్ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కట్టమూరి శ్రీనివాసరావు, వెంకటనర్సయ్య, బంగారురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మూతపడిన వసంతవిహార్ హోటల్

వసంత విహార్‌కి.. ఇక సెలవు!

లీజు ముగియడంతో హోటల్ మూత

డెబ్బై ఏళ్ల ప్రస్థానంలో పల్నాడు వాసులకు అనుబంధం

ఒకటా.. రెండా..ఏడు దశాబ్దాల పాటు ఒక హోటల్‌ను నడపడమంటే మాటలు కాదు. ఒక చరిత్ర. పట్టణంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న వసంత విహార్ హోటల్‌తో పల్నాడు వాసులకు విడదీయరాని అను బంధం. పాతతరం వాళ్లకి ఒక అరుదైన జ్ఞాపకం. ఇప్పటికి ఒక ల్యాండ్ మార్కుగా ఉన్న వసంత విహార్ హోటల్ భవన లీజు ముగియడంతో మూతపడింది.

నరసరావుపేట కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వసంత విహార్ పేరుకే హోటల్‌గాని అది రాజకీయ నాయకులకు, సంగీత, సాహిత్య, కళాకారులకు అదో వేదిక. కాఫీ, టీ తాగుతూ గంటల తరబడి చర్చోపచర్చలు అక్కడ నడిచేవి. 1950 దశకంలో కేరళ నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చిన లక్ష్మమ్మ.. రైలు దిగి వచ్చే ప్రయాణికుల కోసం చిన్న హోటల్‌ను తెరిచింది. దిన దిన ప్రవర్ధమానమై డెబ్బై ఏళ్లపాటు అప్రతిహతంగా నడిచింది. ఆమె తర్వాత మరో మూడు తరాలు ఈ హోటల్‌ను నిర్వహించాయి. ఇప్పుడు చంద్ర, రాజా నడిపిస్తున్నారు. చదువుకోవడానికి రాయలసీమ నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడే భోజనం చేసేవారు. వాళ్లలో చల్లా రామకృష్ణారెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి వంటి వారూ ఉన్నారు. మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఈ హోటల్‌కు ప్రతి నిత్యం వచ్చేవారు. ఇంకా ఎందరో పట్టణానికి చెందిన ప్రముఖులకు ఈ హోటల్ కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. నిర్వాహకులు హోటల్‌ను కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా..వచ్చిన వారిని పేరు పేరునా పలకరిస్తూ పట్టణ వాసుల అభిమానాన్ని చూరగొన్నారు. కళాకారులు, కవులు ప్రతిరోజూ వసంత విహార్‌కు రాకుండా రోజు గడవదు అంటే హోటల్‌తో ఉన్న అనుబంధం అర్థం చేసుకోవచ్చు. అలాంటి వసంత విహార్ హోటల్ మూతపడుతుందంటే పట్టణ వాసులు భావోద్వేగానికి లోనవుతున్నారు. హోటల్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

హోటల్‌తో విడదీయరాని అనుబంధం



నేను కాలేజీ రోజుల నుంచి వసంత విహార్‌కు వస్తున్నాను. నిర్వాహకులు చంద్ర, రాజాలను నా తమ్ముళ్లలాగే చూసే వాడిని. ఎన్ని పనులు ఉన్నా రోజులో కాసేపైనా ఇక్కడికి రాకపోతే తోచదు. ఈ హోటల్‌కు వచ్చే వాళ్లలో చాలామంది ప్రముఖ స్థానాల్లో, విదేశాలలో ఉన్నారు. వాళ్లెప్పుడైనా ఊరికి వస్తే హోటల్‌ను సందర్శించి వెళ్లాల్సిందే.

-మేళం శ్రీకృష్ణ, అడ్వకేట్

ఏదో బంధం తెగిపోతున్న బాధ

-పొన్నపాటి ఈశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నేత



వసంత విహార్ మూసివేస్తున్నారంటే ఏదో బంధం తెగిపోతున్న బాధ కలుగుతోంది. ఈ హోటల్‌తో నాకు, మా లింగంగుంట్ల ప్రజలకు ఒక విడదీయరాని అనుబంధం. ప్రతి రోజు ఇక్కడికి రావాల్సిందే. రాజకీయాలు, సాహిత్యం గురించి గంటల తరబడి చర్చించాల్సిందే. రేపటి నుంచి ఎక్కడ కూర్చోవాలో అని ఆలోచిస్తేనే దిగులుగా ఉంది.

రెండ్రోజులు నిద్ర పట్టలేదు : గుబ్బా సురేష్, వ్యాపారి



చిన్నప్పటి నుంచి ఈ హోటల్‌కు రావడం అలవాటైంది. మా నాన్న గుబ్బా బాల నర్సయ్య ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేసారు. చిన్నప్పుడు నాన్నతో వచ్చి పార్శిల్ తీసుకువెళ్లేవాడిని. అప్పటి నుండి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా హోటల్‌కు వస్తుంటాను. ఇక్కడికి రాకుండా రోజు గడవదు. హోటల్ మూసివేస్తున్నారని చెప్పగానే రెండ్రోజులు నిద్ర పట్టలేదు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్

ప్రమాదానికి ముందే.. ప్రతిస్పందించాలి

సత్తెనపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మరోసారి కరోనా కేసులు నమోదవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గతంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఎందిరికో ఊపిరి పోసిన ఆక్సిజన్ ప్లాంట్లు నిరుపయోగంగా మారడంతో వాటిని బాగు చేయాల్సి ఉంది. గతంలో కొవిడ్ సమయంలో ఏరియా వైద్యశాలలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేసి, చికిత్స అందించారు. కాని ప్రాణ వాయువు అందక చాలా మంది మృతి చెందారు. దూర ప్రాంతాల నుంచి ఆక్సిజన్ సిలిండర్లు తెచ్చుకొని కొంతమంది తమ ప్రాణాలు కాపాడు కున్నారు. ఎక్కడా ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో లేక చాలా మంది ఇబ్బందులు పడ్డారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో కొవిడ్ సమయంలో ఐటీసీ ఆధ్వర్యంలో 300 ఎల్ఎస్‌టీ ఆక్సిజన్ ప్లాంట్ ఒకటి, మెగా ఇంజనీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో 500 పీఎస్‌ఏ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. 2024 వరకు పని చేసిన ఈ ప్లాంట్లు మరమ్మతుల కారణంగా వృథాగా పడి ఉన్నాయి. ఒక ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా లేక నిరుపయోగంగా మారగా.. మరో ప్లాంట్ కంప్రెషన్ మరమ్మతులకు గురైంది. దీంతో ఏడాదిన్నరకు పైగా ఆక్సిజన్ ప్లాంట్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో మళ్లీ సిలిండర్ల ద్వారా రోగులకు అవసరమైన ఆక్సిజన్ సరఫరా చేస్తూ ఆస్పత్రి సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం సమస్య లేక పోయినా కొవిడ్ నేపథ్యంలో వాటి అవసరాన్ని గుర్తించాల్సి ఉంది. ఈ విషయంపై ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ మరమ్మతులు కారణంగా ఆక్సిజన్ సిలిండర్లు నిరుపయోగంగా మారిన మాట వాస్తవమేనని తెలిపారు. వీటి మరమ్మతులకు ప్రతి పాదనలు పంపి, ఉన్నతాధి కారులకు నివేదించామన్నారు. వైద్యశాలలో రోగులకు 60 డీ టైప్ సిలిండర్ల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మరో 50 వరకు ఆక్సిజన్ యంత్రాలు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఆక్సిజన్‌కు ఎటువంటి ఇబ్బంది లేదని చెప్పారు.

అప్పుడు.. ఇప్పుడూ.. సమిధలు వారే!

(5వ పేజీ తరువాయి)

ముందు రోజు రాత్రి పిన్నెల్లి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి గుండ్లపాడు వచ్చి వైసీపీ నేత, ఆ కేసులో ప్రధాన నిందితుడు చింతా శివరామయ్యను ఆయన ఇంటిలోనే కలసి వెళ్లాడు. అప్పుడే చంద్రయ్య హత్యకు ముహూర్తం పెట్టినట్లు పోలీస్ శాఖ నిర్ధారణకు వచ్చింది. చంద్రయ్య హత్య జరగడానికి అరగంట ముందు ఓ ఎస్సై సివిల్ డ్రెస్‌లో గ్రామానికి వచ్చి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. హత్యకు అనుకూల వాతావరణం ఉందా.. లేదా అని రెక్కీ నిర్వహించి వెళ్లారు. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి చెందిన పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఈ రెక్కీ నిర్వహించారని తెలుస్తోంది.

నిందితులు సాక్షులుగా, సాక్షులు నిందితులుగా..

తోట చంద్రయ్య హత్య జరిగిన ఆర్నెల్లకే అంటే 2022 జూన్ 3న దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హతమార్చారు. అంతకు ముందే.. జల్లయ్య గ్రామాన్ని వదిలి గురజాల పరిధిలోని మాడుగులలో తలదాచుకుంటున్నాడు. జల్లయ్యను హతమారిస్తే గ్రామంలో తమ ఆధిపత్యానికి ఎదురుండదని వైసీపీ నాయకులు భావించారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడైన జంగమహేశ్వరపాడుకు చెందిన రౌడీషీటర్ మన్నెయ్య, ఆయన సోదరులు జల్లయ్యను హతమా ర్చేందుకు సిద్ధమయ్యారు. జల్లయ్య రావులాపురం గ్రామంలో తన అన్న కుమార్తె వేడుకకు వస్తుండగా.. మన్నెయ్య నేతృత్వంలో జంగమహేశ్వ రపాడు శివారు కాకిరాల అటవీ ప్రాంతంలో దారి కాచి కత్తులతో పొడిచి దారుణంగా జల్లయ్యను హత మార్చారు. ఈ హత్యకు పాల్పడిన మన్నెయ్య, మరి కొందరిపై హత్య కేసు బనాయించకపోగా జల్లయ్యతో పాటు ఉండి ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన జల్లయ్య మేనమామలనే నిందితులుగా చేర్చి.. కేసు నమోదు చేశారు. జల్లయ్యను హత్య చేసిన వారినే ఈ కేసులో సాక్షులుగా పేర్కొనడం నాటి దారుణాలకు పరాకాష్ఠ. జల్లయ్యను హత్య విషయం పోలీసులకు ముందుగానే తెలుసనేది బహిరంగ రహస్యం.

బాధితులనే నిందితులుగా..

కొందరు టీడీపీ నాయకులు కారంపూడి వద్ద ఓ శుభకార్యానికి వెళ్తే.. రౌడీషీటర్ మన్నెయ్య, అతని అనుచరులు వారిపై హత్యాయత్నం చేశారు. ఆటోతో వారిని ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఇద్దరి కాళ్లు విరగ్గా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో టీడీపీ వాళ్లు మన్నెయ్యను చంపడానికి యత్నిస్తే ఆయన దానిని ప్రతిఘటించారని బాధితులపైనే కేసు నమోదు చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల ఏకగ్రీవాల బాధ్యత ఖాకీలదే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవం చేసే బాధ్యత ఖాకీలు తమ భుజస్కందాలపై వేసుకున్నారు. గ్రామాల్లో టీడీపీ తరపున నామినేషన్‌లు వేయకుండా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు పోలింగే జరగకుండా చేయాలని పిన్నెల్లి బ్రదర్స్ నుంచి వచ్చిన ఆదేశాలను ఆయా పోలీస్ అధికారులు పాటించారు. ఎవరైనా నామినేషన్ వేయడానికి ముందుకు వస్తే రాత్రికిరాత్రే వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి కూర్చోపెట్టి బలవంతంగా మెడలో కండువా మార్చారు. అప్పటికీ మాట వినకుంటే అక్రమ మద్యం కేసులు బనాయించి జైలుకు పంపారు. ఓ ఎస్సై వేధింపులతో వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మాచర్ల నియోజకవర్గంలో ఒకటిరెండు మినహా ఎక్కడ కూడా స్థానిక సంస్థల ఎన్నికలు జరగలేదు. రెంటచింతల పరిధిలోని పాలువాయి, తుమ్మకోటలో మాత్రమే పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుమ్మకోటలో టీడీపీ అభ్యర్థి గెలిస్తే స్థానిక ఎస్సై దగ్గరుండి కౌంటింగ్ సమయంలో కరంట్ తీయించి ఫలితాన్ని తారుమారు చేసి వైసీపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారు. జడ్పీటీసీకి పోటీ చేసేందుకు నామినేషన్ వేసేందుకు టీడీపీ నేతలు మాచర్ల మండలం జమ్మలమడక నుంచి వెళ్తుండగా.. పోలీసులు రెంటచింతలలో అడ్డుకుని వారిని మాచర్ల రూరల్ పోలీసులకు అప్పగిస్తే మాచర్ల రూరల్ పోలీసులు వారి మీద అక్రమ మద్యం కేసు పెట్టి అరెస్ట్ చేశారు.

మిస్టరీగా పిన్నెల్లి సోదరుడి భార్య, కూతురి మరణాలు

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బాబాయి సుందరరామిరెడ్డి తనయుడు మధుసూదనరెడ్డి భార్య, కూతురు మరణాలు ఇప్పటికీ మిస్టరీగా మిగిలిపోయాయి. 2022లో మధుసూదనరెడ్డి భార్య లావణ్య (30), కుమార్తె సుదీక్ష (5) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అడిగొప్పుల వద్ద వారు ప్రయాణిస్తున్న కారు కాల్వలోకి దూసుకుపోయిందని, ఈ ప్రమాదంలో తాను తప్పించుకోగా.. భార్య, కూతురు కాల్వలో మునిగి చనిపోయారనేది మధుసూదనరెడ్డి వాదన. పోస్టు మార్టం నివేదికలో వారు ఊపిరాడక చనిపోయారని, వారి ఒంటిమీద ఏడెనిమిది గాయాలు ఉన్నట్లు వెల్లడైంది. కానీ, కేసును ప్రమాదవశాత్తు జరిగిన మరణాలుగా పేర్కొంటూ మూసివేయడం మరిన్ని అనుమానాలకు ఆజ్యం పోసింది.

నివేదిక తొక్కిపెట్టిందెవరు?

ఈ మూడు కేసులపై కూటమి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే జూల కంటి బ్రహ్మనంద రెడ్డి పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన రాకపోవడంతో చివరకు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. సీఎం ఆదేశాలతో కేసులను పునఃవిచారణ జరిపించారు. ఈ మూడు కేసుల్లో పిన్నెల్లి సోదరుల ఒత్తిడి మేరకు నాటి పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిం చినట్లు విచారణ అధికారి ఎప్పుడో నివేదిక కూడా అందించారు. అయితే ఈ నివేదిక ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అంటే ఆయా నివేదికలను ఉద్దేశపూర్వకంగా తొక్కి పట్టిందెవరు? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర విచారణ జరిగితే సగం మంది పోలీసులు ఇంటికే..

గత ఐదేళ్లలో పల్నాడులోని మాచర్లటౌన్, మాచర్ల రూరల్, దుర్గి, రెంటచింతల, కారంపూడి, నాగార్జునసాగర్, వెల్దుర్తి తదితర పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించిన అనేక మంది ఎస్సైలు, సీఐల అక్రమాలపై విచారణ జరిపితే వారిలో అత్యధిక మంది సర్వీస్ నుంచి డిస్మిస్ అవుతారనే వాదన ఉంది. నాడు ఖద్దరుతో మిలాఖత్ అయిన పలువురు ఖాకీలు ఒకవైపు పిన్నెల్లి బ్రదర్స్ కనుసన్నల్లో పని చేస్తూ.. మరోవైపు కోట్లు దండుకున్నారు. ఆ విధంగా దోచుకున్న నోట్ల కట్టలను ఓ ఎస్సై తాను అద్దెకు ఉంటున్న ఇంటి సీలింగ్‌లో దాచారని, మరో ఎస్సై ఏకంగా అక్కడి టౌన్‌షిప్‌లో పెట్టుబడి పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.

సమాజ హితమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

లక్ష్యమని వివరించారు. ఇందులో తన తల్లిదండ్రులు పద్మజ, భాను కృష్ణమూర్తి ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు.

సివిల్స్ సాధించడం కోసం

-ఎన్.ఆకాష్, 108వ ర్యాంకర్



ఐఐటీ బాంబేలో సీఎస్‌సీ పూర్తి చేసిన తర్వాత ఐఏఎస్ కోసం సివిల్స్ సన్న ద్ధం కాను న్నట్లు 108వ ర్యాంకర్ ఎన్.ఆకాష్ వెల్లడిం చారు. ర్యాంకు సాధన కోసం రోజుకు 12గంట లుపైగా చదివినా ఒత్తిడిలేని విధానంలో పరీక్ష లకు సన్నద్ధం అయినట్లు తెలిపారు. తల్లిదం డ్రులు వసంత, వీరపునాయుడు ప్రోత్సాహం తో లక్ష్యం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

సెమీ కండక్టర్ విభాగంలో రాణించాలి

-విక్రంలేవి, 146వ ర్యాంకర్



ఐఐటీలో బీటెక్ పూర్తి చేసిన తర్వాత సెమీ కండక్టర్స్ పై పరిశోధన చేసి నూతన ఆవిష్కరణలు చేయాలనేది లక్ష్యమని 146వ ర్యాంకు సాధించిన ఇ.విక్రం లేవి తెలిపారు. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ బ్రాంచ్‌లో బీటెక్ పూర్తి చేస్తానని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పరిశోధనలు

జస్వంత్, 151వ ర్యాంకర్



ఐఐటీ బాంబేలో సీఎస్‌సీ పూర్తి చేసి.. పర్యావరణ పరిరక్షణ కోసం పరిశోధనలు చేయడం లక్ష్యమని 151 వ ర్యాంకర్ జస్వంత్ బాలాజీ వెల్లడించారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి తన వంతు చేయూత అందిస్తానని చెప్పారు.

వైజ్ఞానిక పరిశోధనలే లక్ష్యం

సాయి మనోజ్ఞ, 152వ ర్యాంకర్



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో గణితం, కంప్యూటర్ విభాగంలో బీటెక్ పూర్తి చేసి పరిశోధనలు చేయడమే లక్ష్యమని 152వ ర్యాంకర్ సాయి మనోజ్ఞ తెలిపారు. బెంగళూరులో ఉన్న ఐఐఎస్‌లో బీటెక్ చేయాలని ఆసక్తి ఉందన్నారు. బీటెక్ తర్వాత వైజ్ఞానిక అంశాలపై పరిశోధనలు చేయడం లక్ష్యమని వివరించారు.

బీటీ..రాష్ట్రం దాటి..!

(5వ పేజీ తరువాయి)

అరకేజీ రూ.300 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు అధిక మొత్తంలో బీటీ-3 విత్తనాలు ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు ఎక్కువ మొత్తంలో వెళ్లిపోయాయి. అదే సమయంలో తెలంగాణకు కూడా ఎక్కువ మొత్తంలో నిల్వలు తరలించారు. అక్కడ కొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని విక్రయాలు జరిపే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసిన బీటీ-3 విత్తనాల ప్యాకెట్లు అక్కడ అధిక ధరకు విక్రయస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు.

తూతూ మంత్రమే..

వాస్తవానికి ఖరీఫ్ సీజన్ ఆరంభం అవుతున్న నేపథ్యంలో కమిషనర్ ఆదేశాలతో ఆటో నగర్‌లోని కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల సమాచారం ముందే తెలియడంతో ఎక్కడా ఏమీ లభ్యం కాలేదని అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఒక చోట కొన్ని విత్తనాలు దొరికినా.. కొందరు అధికారులు వాటిని సర్దుబాటు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నగరంలో 34 పార్శిల్ కార్యాలయాలు ఉన్నప్పటికీ వాటిని తనిఖీ చేసే నాథుడు లేకపోవడం గమనార్హం.

ఒక్క కేసూ లేదు

గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం పరిధిలో ముగ్గురు ఏఓలను ప్రత్యేకంగా నియమించారు. గుంటూరు నగర పరిధిలో నిఘా వేసి నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పట్టుకోవడం వీరి పని. గడచిన ఏడాది కాలంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం పరిధిలో పనిచేసే ఏఓ లు పెద్దగా దాడులు చేసిన సందర్భాలు లేవు. గతంలో ఏడాదికి తక్కువలో తక్కువ 15 కేసులు నమోదు అయ్యేవి. గడచిన ఏడాదిలో ఒకటీ రెండు కేసులు తప్ప ఎక్కువ నమోదు కాలేదు. అంటే నకిలీలను అరికట్టే విషయంలో వ్యవసాయ శాఖ ఏ మేరకు కఠినంగా వ్యవహరించిందో అర్థం చేసుకోవచ్చు.

అధికారులకు స్నేహితులే వ్యాపారులు..

నగర పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తయారు చేసే వారంతా వ్యవసాయ శాఖలోని ఏదో ఒక స్థాయి అధికా రుల స్నేహితులు.. సహ విద్యార్థులే అని తెలు స్తోంది. ఆ అనుబంధం రైతులను నట్టేట ముంచేందుకు బాగానే ఉపయోగపడుతోంది. ప్రస్తు తం ఉన్న అధికారుల మీద ఇటువంటి ఆరోప ణలు ఎక్కువగా ఉన్నా కమిషనరేట్‌లోని గాడ్ ఫాదర్ లు ఆశీస్సులు మెండుగా ఉన్నందువల్ల ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

నగర పోస్టు.. భలే కాస్టు

గుంటూరు నగర పరిధిలోని ఏఓ పోస్టుకు బాగా గిరాకీ ఉంది. నగర పరిధిలోనే లెక్కకు మించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ కంపెనీలు, డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇక్కడ తనిఖీకి వెళ్లకుండా ఉంటే ఏడాది రూ.కోట్లలో ఆదాయం వస్తుంది. అందుకని ఈ పోస్టుల్లోకి వచ్చేందుకు మొదటి నుంచి భారీ లాబీయింగ్ నడుస్తోంది. రాజకీయ నేతలు, అధికారుల ఆశీస్సులు ఉన్న వారికే ఈ పోస్టుల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది. కమిషనరేట్‌లోని కొందరు కీలక అధికారుల సిఫార్సుతో వైసీపీ నేపథ్యం ఉన్న వారిని ప్రస్తుతం ఆ పోస్టుల్లో నియమించడం వివాదాస్పద మయ్యింది.



గుండ్లపల్లి పంచాయతీ కార్యాలయం

గ్రేట్‌గా పంచాయతీలు

- బలోపేతానికి ముందడుగు
- స్పెషల్ గ్రేడు, గ్రేడు - 1, 2, 3గా వర్గీకరణ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు..
- పూర్తికావొచ్చిన కసరత్తు
- మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సత్వర పౌర సేవలు

నకరికల్లు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల బలోపేతానికి కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పన, ప్రజలకు చేరువలో సుపరిపాలన, వేగవంతంగా పౌర సేవలను అందించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇందుకు గ్రామ పంచాయతీలను స్పెషల్ గ్రేడ్, గ్రేడు - 1, 2, 3లుగా వర్గీకరణకు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు.

పల్నాడులో 12 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు..

పల్నాడు జిల్లాలో 526 పంచాయతీల్లో స్పెషల్ గ్రేడు కిందకు 12 పంచాయతీలు, గ్రేడు - 1లో 108, గ్రేడు - 2 168, గ్రేడు - 3లో 238 పంచాయతీలు వర్గీకరిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. నకరికల్లు, గుండ్లపల్లి గ్రామ పంచాయతీలను నకరికల్లు మండలంలో స్పెషల్ గ్రేడు చేరుస్తూ- ప్రతిపాదనలను సిద్ధం చేసి పరిపాలన ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. గేడు - 1 కింద కుంకలగుంట, చేజర్ల, దేచవరం, చల్లగుండ్ల, కండ్లకుంట గ్రామాలను, గ్రేడు - 2 కింద చాగల్లు, రూపెనగుంట్ల, చీమలమర్రి, నరసింగపాడు, గ్రేడు - 3గా తురకపాలెం, త్రిపురాపురం, అడ్డరోడ్డు, జల్లాపేట తండా, బాలాజీ నగర్ తండా, శివాపురం తండాలను చేరుస్తూ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

గతంలో ఐదు గ్రేడ్‌లు

కూటమి ప్రభుత్వం నూతన ప్రతిపాదనలకు ముందు వరకు గ్రామ పంచాయతీలు ఐదు గ్రేడ్లుగా ఉండేవి. ప్రభుత్వం నిర్ణయంతో స్పెషల్ గ్రేడు పంచాయతీలతో పాటు గ్రేడు - 1, 2, 3 పంచాయతీలుగా రూపు మారనున్నాయి.

గిరిజన గ్రామాల్లో మార్పులు..

ఇదే గ్రేడుల విషయంలో గిరిజన గ్రామ పంచాయతీల విషయంలో కొంత మినహాయింపు ప్రభుత్వం ఇచ్చింది. 5 వేలకు పైన జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను స్పెషల్ గ్రేడుగా పరిగణిస్తారు. మూడు వేల నుంచి ఐదు వేలు లోపు జనాభా ఉన్న పంచాయతీ లేదా మండల ప్రధాన కేంద్రం గ్రేడు - 1 కిందకు వస్తుంది. గ్రేడు - 2లో 1,500పైనా.. మూడు వేలకు లోబడి జనాభా ఉండాలి. 1,500 లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీలన్నీ గ్రేడు - 3 పరిధిలోకి వస్తాయి. .

మార్గదర్శకాలు ఇలా..

పది వేలకు పైగా జనాభా, రూ.కోటికి పైగా ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీని స్పెషల్ గ్రేడు పంచాయతీగా ప్రభుత్వం పరిణగిస్తుంది. ఇక గ్రేడు - 1లో పది వేల లోపు 4 వేలకు పైన జనాభా, రూ.50లక్షల నుంచి రూ.కోటి లోపు ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీలు లేదా మండల కేంద్రం గ్రామ పంచాయతీలను కూడా చేర్చారు. గ్రేడు - 2 పరిధి లోకి రెండు వేల పైన జనాభా కలిగిన గ్రామ పంచా యతీలు వస్తాయి. రెండు వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు గ్రేడు - 3 కిందకు వస్తాయి.

దాదాపు పూర్తయిన కసరత్తు..

గ్రామ పంచాయతీల గ్రేడ్‌ల కసరత్తు దాదాపుగా పూర్తయింది. ఉన్నతాధికారుల ఆమోద ముద్రే తరువాయి. పంచాయతీలకు సిబ్బంది నియామకంపై కసరత్తు జరుగుతోంది. స్పెషల్ గ్రేడు పంచాయతీలకు గజిటెడ్ అధికారి హోదా కలిగిన అధికారిని నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఐదు క్యాటగిరిల్లో ఉండగా వారిని మూడు క్యాటగిరిలకు సర్దు బాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన వేగవంతంగా పౌర సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తుంది. ఆ దిశగా వేగంగా కసరత్తును చేస్తుంది



నకరికల్లు పంచాయతీ కార్యాలయం

టిడ్కో గృహాల వద్ద వివేకానంద సేవా సమితి సేవలు

చిలకలూరిపేట, జూన్2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టిడ్కో గృహాల కాలనీలో సోమవారం స్థానిక వివేకానంద సేవా సమితి వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం టిడ్కో గృహాల్లో నివసిస్తున్న పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 12 సంవత్సరాలుగా దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా సమితి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఏఎస్ఐ హుస్సేన్, వలివేటి సత్యనారాయణ, కాపు వెంకట్రావు, బ్రహ్మం, నాగభైరు జగన్మోహనరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వివాహిత ఆత్మహత్య

వినుకొండ టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో వివాహిత ఉరివేసుకుని మృతిచెందిన సంఘటన మండలంలోని బ్రహ్మయ్య పాకాలవద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే యర్రగొండపాలెం మండలం పెద్ద గుడిపాడుకు చెందిన పాట్యాపు నాగేశ్వరావుతో, ప్రకాశం జిల్లా, కురిచేడు మండలం, పెద్దవరం గ్రామానికి చెందిన అంజిలికి రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆరు నెలల క్రితం బతుకుతెరువుకు వినుకొండ మండలం బ్రహ్మయ్య పాకాల వద్ద ఉన్న బంధువుల వద్దకు వచ్చి ఉంటున్నారు. అంజిలి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందింది. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వగ్రామానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదుచేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అందచేశారు.

మున్సిపాలిటీకి మూడు అర్జీలు

నరసరావుపేట రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మూడు దరఖాస్తులు వచ్చినట్లు మునిసిపల్ డిప్యూటీ ఈఈ షేక్ మహమ్మద్ రఫీ తెలిపారు. ఇంటి నివేశ స్థలం కోసం రెండు దరకాస్తులు, రామిరెడ్డిపేటలో చెట్లను తొలగించాలని ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ టీపీవో ఎ. సాంబయ్య, ఎ.అనూరాధ, ఆర్వో కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యమ్మకు పలువురి నివాళి

చిలకలూరిపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జీడీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు మాతృమూర్తి మానం మాణిక్యమ్మ (89) భౌతికకాయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం గుంటూరులో సందర్శించి నివాళులర్పించారు. మానం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కూడా మానం వెంకటేశ్వర్లును గుంటూరులో పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. చిలకలూరిపేట పట్టణం, నాదెండ్ల మండలం నుంచి పలువురు ప్రముఖులు గుంటూరుకు వెళ్లి మాణిక్యమ్మకు నివాళులర్పించారు.

మృతి చెందిన వ్యక్తి వేలూరు వాసిగా గుర్తింపు

నాదెండ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజుల క్రితం క్వారీలో పడి మృతిచెందిన వ్యక్తిని చిలకలూరిపేట మండలం వేలూరుకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వేలూరు గ్రామానికి చెందిన మృతుడు ఎం.పెదజక్కయ్య (30) గడిచిన 28వ తేదీన చేపలు పట్టుకొనేందుకు గణపవరంలోని క్వారీ కుంట వద్దకు వచ్చాడు. చేపలు పడుతున్న జక్కయ్యకు ఫిట్స్ రావటంతో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. కాగా మృతుడి భార్య కోటమ్మ తన భర్త కన్పించటం లేదని నాదెండ్ల పోలీసులను ఆశ్రయించింది. ఈ క్రమంలో మృతదేహాన్ని భార్యకు అప్పగించారు. ఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థికసాయం అందజేత

బొల్లాపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరికొండపాలెం తండాలో ఇటీవల విద్యుత్ షాక్‌తో మేరజోత్ కృష్ణా నాయక్ మృతి చెందాడు. కృష్ణా నాయక్‌కు ఐదుగురు సంతానం. ఈ నేపథ్యంలో ఆలిండియా బంజార సేవా సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన హలూజ, సువర్ణ కుటీర మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జత్రావత్ రాంబాబు నాయక్, ప్రణవీ గ్రూప్ ఆఫ్ చైర్మన్ విష్ణుమూర్తి నాయక్, కృష్ణా నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.5వేలు నగదు, వంట సామగ్రి, కుటుంబంలోని ఇద్దరి పిల్లలకు పూర్తిగా చదువుల నిమిత్తం పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు, గ్రామస్థులు జాన్ బాబు నాయక్, బాణావత్ రవినాయక్, మూడావత్ రమేష్‌నాయక్, రాము మాస్టారు, క్రాటావత్ నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులిచ్చిన 81మందికి పింఛన్లు అందజేశాం: ఎంపీడీవో

శావల్యాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఫించన్లపై వచ్చిన ఫిర్యాదులమేరకు మండలంలోని పోట్లూరు, పిచికలపాలెం గ్రామాల్లో ఆధారాలు చూపించాలని నోటీసులిచ్చిన 81మందికి సోమవారం పించన్లు అందజేసినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఆధారాలు పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే పింఛన్లను కొనసాగిస్తామన్నారు.

కేఎస్ జవహర్‌కు పలువురి అభినందనలు

నరసరావుపేట టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రంలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా కేఎస్ జవహర్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి అధ్యక్షుడు చింతిరాల మీరయ్య కలిసి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. వీరితోపాటు ఎంఆర్‌పీఎస్‌ఎస్ నాయకులు శ్రీనివాసరావు, దాను, ప్రశాంత్, వసంత్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి బాధ్యతతో పనిచేయాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి 158 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కరవేదికలో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్వో, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వద్దకు వెళ్లి అర్జీల స్వీకరణ

నరసరావుపేటలోని పల్నాడు కలెక్టర్ కార్యాలయం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల దినోత్సవంలో భాగంగా పట్టణంలోని 6వ వార్డు బాబాపేటకు చెందిన పుట్టుకతోనే రెండు చేతులు, రెండు కాళ్ళులేని మండ్ల మరియమ్మ కలెక్టర్ కార్యాలయానికి వచ్చింది. అదే విధంగా పట్టణంలోని బాబాపేటకు చెందిన షేక్ మస్తాన్‌బీ మరగుజ్జులైన కుమారులు షేక్ ఇస్మాయిల్, షేక్ సుభానిలు హాజరయ్యారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ అరుణ్‌బాబు వారి వద్దకు వెళ్ళి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రూ.6 వేలు పెన్షన్ వస్తుందని, కానీ రూ.10వేలు పింఛను కావాలని అర్జీలు అందజేశారు. దీనిపై కలెక్టర్ మెడికల్ బోర్డుకు సిఫార్సు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం మధులత, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ బీవీ రవి, తహసీల్దార్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గో రవాణాపై చర్యలు తీసుకోవాలి

విశ్వహిందూ పరిషత్ గోరక్ష జిల్లా ప్రముఖ్ తుమ్మ మల్రెడ్డి, క్రోసూరు గోరక్ష కమిటీ సభ్యులు బాలకృష్ణ, వీరబాబు, నరసరావుపేట వాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, తదితరులు కలిసి వినతి పత్రం సోమవారం కలెక్టర్ పీ అరుణ్‌బాబుకు అందజేశారు. క్రోసూరు మార్కెట్ యార్డు సమీపంలో అక్రమ గో రవాణా జరుగుతుందని, ఖబేళాలకు తరలిస్తున్నారని చెప్పారు. దీనిపై ఫిర్యాదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆవులూరిపాలెం దగ్గర రెండు షెడ్లు వేసి ప్రైవేట్ బ్రోకర్లు మాఫియా గోవులను అక్రమంగా కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు తరలిస్తున్నారని అన్నారు. గోవుల్ని లారీలలో పట్టనప్పుడు కాళ్ళు విరగొట్టి డబ్బా వ్యాన్‌లలో తీసుకెళుతున్నారన్నారు. జంతువుని హింసించడం తగదని, మాంసాలు తినే పండుగలు వచ్చినప్పుడు ఈ విధంగా చేయడం జరుగుతుందన్నారు. స్థానిక తహసీల్దార్, సీఐ, ఎస్ఐ, పంచాయతీ కార్యదర్శులకు జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీలకి వినతి పత్రాలు సమర్పించామన్నారు. గోవధపై తక్షణమే పోలీసు నిఘా ఉంచాలని విశ్వహిందూ పరిషత్ తరపున విజ్ఞప్తి చేశారు.

పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ ధర్నా

వినుకొండ, జూన్ 2, (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో నిరుపేదలకు సొంత ఇంటి కల వెంటనే నెరవేర్చాలని సీపీఐ వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలువలపూడి రాము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలులపు మేరకు వినుకొండ పట్టణంలో నిరుపేద మహిళలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పట్టణాలల్లో ఇచ్చిన సెంటు భూమిని పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం గ్రాంట్ చేసిన రూ.1,80,000 రుణం సరిపోదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని అందులో పక్కా గృహం నిర్మించుకునేందుకు రూ.4లక్షలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చార న్నారు. హమీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళలతో కలిసి తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందచేశారు, కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పఠాన్ లాల్‌ఖాన్, పోట్లూరి వెంకటేశ్వర్లు, షేక్ నాగూర్, తోటా నరసింహరావు, అల్లాభక్షు, చిన్న సైదా, టంగుటూరి సుబ్రహమణ్యం, సుబ్బారావు, వెంగళ బ్రహ్మం, చిన్న వెంకటేశ్వర్లు, షేక్ ఫాతిమ, మున్నీ, ఆఫ్రీన్, సైదాబీ, గౌషియా, రజియా, సుల్తానా, మహాబీ, కరిమూన్, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, జూన్2 (ఆంధ్రజ్యోతి): అరులైన ప్రతి పేదకు నివేశన స్థలాలు అందేవరకు సీపీఐ అండగా ఉంటుందని సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురారావు అన్నారు. నివేశన స్థలాల సమస్యపై సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు తహసీల్దార్ హుస్సేన్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, పార్టీ నాయకులు మల్లికార్జున్, రాము, నవీన్, అంజయ్య, చౌటుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తహసీల్దార్ సురేష్‌కు వినతి పత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు రాము, మహిళలు

ఈపూరులో...

ఈపూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఈపూరు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదన్నారు. పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేయాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు ఏ నళినికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన అర్హులందరికీ ఇంటి స్థలాలిచ్చి ఇంటి నిర్మాణాలు చేయిస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి రాయబారం వందనం డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం వద్దకు సోమవారం ర్యాలీగా వచ్చి తహసీల్దార్ అర్జున్‌నాయక్‌ను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు జల్లి వెంకటేశ్వర్లు, నక్కా శ్రీదేవి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ బండి నిర్మలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి, జమ్ములమూడి వెంకటేశ్వర్లు, పానం మత్తయ్య, పిడెం హుస్సేన్, ముప్పూరి మధుసూదనరావు, కోటయ్య, వెన్నా గోపిరెడ్డి పాల్గొన్నారు.



తనిఖీలో పాల్గొన్న ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్‌కుమార్

నరసరావుపేట రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి జి. సంజీవ్‌కుమార్ తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల ప్రకారం పల్నాడు జిల్లాలోని పోలీస్, రవాణా, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 9మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అందులో 3 వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పలు వాహనాలపై అపరాధ రుసుం రూ.54510 విధించినట్లు తెలిపారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో మలేరియా అవగాహన ర్యాలీ

నరసరావుపేట లీగల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం మలేరియా మాసోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో రవీంద్ర రత్నాకర్, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ హనుమకుమార్, శ్రీనివాస్, సీతారామారావు, సిబ్బంది ఆశలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో రంగారెడ్డిపాలెం విద్యార్థి ప్రతిభ

నరసరావుపేట రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగారెడ్డి పాలెం చెందిన విద్యార్థి ఏరువ మధుసూదన్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ర్యాంక్ సాధించినట్లు విద్యార్థి తండ్రి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. సీఆర్ఎల్ ర్యాంకు 1720, జనరల్ ఈడబ్ల్యూఎస్ ర్యాంకు 153 సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డిని గ్రామస్థులు అభినందించారు.

50శాతం రాయితీలపై విత్తనాల పంపిణీ

● మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామారావు

శావల్యాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున రైతులు పొలాల్లో చల్లుకొనేందుకు ప్రభుత్వం 50శాతం రాయితీపై జనుములు అందజేస్తుందని, ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జనుములు 10కేజీల బ్యాగు ప్రస్తుతం రూ.1090 ఉండగా 50శాతం రాయితీపోను రూ.545లకే అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలో మతుకుమల్లిలో తప్ప అన్ని రైతుసేవా కేంద్రాల్లో జనుములు అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, పిల్లిపెసరలు ఏపీ సీడ్స్ నుంచి రాగానే రైతులకు అందజేస్తామన్నారు. మినుములు, పెసలు, కంది విత్తనాలు కావలసిన రైతులు రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలకు తెలియజేసినట్లయితే వెంటనే వారు కోరిన విత్తనాలను తెప్పించి ప్రభుత్వమందించే రాయితీ ధరలకు సరఫరా చేస్తామని తెలిపారు.

● ఈపూరు: రైతులకు యాభైశాతం రాయితీపై పచ్చిరొట్టి విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు తెలిపారు. పిల్లిపెసర, జీలుగ కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

వెన్నుపోటు దినం - నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా జూన్ 4వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నరసరావుపేట పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ప్రభుత్వ విధానాలకు నిరసనగా నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమం పోస్టరును మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ర్యాలీ కార్యక్రమం సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయం వద్ద నుంచి శివుడు బొమ్మ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి ఈ ప్రభుత్వ పాలనపై నిరసనగా ఆర్డీవోకు వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు అభిమానులు, శ్రేయోభిలాషులు, పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో విజేత వేల్పూరు జట్టు

వేల్పూరు (శావల్యాపురం) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడులో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన వేల్పూరు యంగ్‌స్టర్స్ జట్టు ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచినట్లు జట్టు కెప్టెన్ కొంగలేటి కొండలు సోమవారం తెలిపారు. కొండలు మాట్లాడుతూ టోర్నమెంట్‌లో మొత్తం 35టీంలు పాల్గొనగా వేల్పూరు యంగ్ స్టర్స్, ఇర్లపాడు మెయిన్ జట్లు ఫైనల్‌కు చేరాయని, ఇరుజట్ల మధ్య ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో వేల్పూరు యంగ్‌స్టర్ జట్టు విజయం సాధించినట్లు తెలిపారు. ప్రథమస్థానంలో నిలిచిన వేల్పూరు యంగ్‌స్టర్స్ జట్టుకు టోర్నమెంట్ నిర్వాహకులు రూ.20వేలు నగదు బహుమతితో పాటు షీల్డ్‌లను అందజేసి అభినందించినట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన యంగ్‌స్టర్స్ జట్టును జడ్పీటీసీ పారా హైమావతి, సీనియర్ నాయకులు బొల్లా పేరయ్య, సాదినేని కృష్ణమూర్తి, దొడ్డా ఏడుకొండలు, పారా చౌదరి, పూరేటి శ్రీకాంత్, లింగా శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 63 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, జూన్ 2, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ అంశాలకు సంబంధించి 63 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. చిలకలూరిపేట లంబాడి కాలనీ వద్ద నివాసం ఉంటున్న అనుమర్లపూడి అరుణాదేవికి కుమారుడు నాగ సాయి హేమంత కుమార్ గుప్తాతో అతని స్నేహితులు కొంతమంది యాప్‌లో లోన్లు తీయించి భయభ్రాంతులకు గురిచేయటంతో ఊరు వదిలిపెట్టి పోయాడని ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. వినుకొండ మండలం నాగులవరం గ్రామానికి చెందిన దేవరకొండ చినవెంకటేశ్వర్లు అతని భార్య నాగేంద్ర తన వద్ద మూడు లక్షలు అప్పు తీసుకొని వాటిని చెల్లించమని అడుగుతుంటే చిన్న వెంకటేశ్వర్లు అతని భార్య నాగేంద్రం అతని మేనల్లుడు దాడి చేసినట్లు పాలపర్తి రామారావు ఫిర్యాదు చేశాడు. భర్త ప్రేమ్ కుమార్ వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని మద్యం సేవించి తనను నిత్యం వేధిస్తున్నాడని నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన షేక్ నాగూర్ ఫిర్యాదు చేసింది. తనకు టెలిగ్రామ్ యాప్ ద్వారా వచ్చిన లింక్‌లోని వారిని సంప్రదించగా పెట్టుబడి పెడితే లాభాలు వచ్చేలా చేస్తామని చెప్పి తన వద్ద 71,700 రూపాయలు తీసుకున్నారని వినుకొండకు చెందిన ఈపెనగండ్ల వీరాంజనేయులు ఫిర్యాదు చేశాడు. తన డబ్బులను మోసపూరితంగా తీసుకున్న వారిపై తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదుచేశారు. ప్రజలకు ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

ఇష్టారాజ్యంగా రహదారి మరమ్మతులు

● ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు



రొంపిచర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల నుంచి నరసరావుపేట వెళ్ళే రహదారిలో ఇటీవల రహదారి మరమ్మతులు ఇష్టారాజ్యంగా నిర్వహించారు. ఐతే పలుచోట్ల రహదారిని సక్రమంగా కలపక పోవటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు నిర్వహించిన రహదారి, పక్కన ఉన్న రహదారి ఎగుడు దిగుడుగా ఉండటంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు సక్రమంగా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పెట్టుబడిసాయం అందించాలి

● కౌలు రైతు సంఘం నాయకుల వినతి

యడ్లపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని కౌలు రైతులకు కూడా వర్తింపచేసి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలంటూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు రైతులకు పెట్టుబడి సాయం కింద మొత్తం రూ.20వేలు మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే రూ.20వేలు జమచేస్తామని హామీ ఇచ్చింది. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా చెల్లింపులకు సంబంధించిన విధివిధానాలను రూపొందించకపోవడంతోపాటు అర్హులైన కౌలు రైతులను కూడా గుర్తించలేదు. రాష్ట్రంలో 72లక్షల మంది భూమి కలిగిన రైతులు ఉన్నప్పటికీ వారిలో 50లక్షల మంది మాత్రమే అర్హత కలిగినవారున్నారన్నారు. మిగిలిన వారి భూమిని భూమిలేని వ్యవసాయ కూలీలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారన్నారు. వ్యవసాయరంగంలో ఎక్కువగా కౌలు రైతులే భూములు సాగుచేసి పంటలు పండిస్తున్నారని పెట్టుబడి సాయం ముందుగా కౌలు రైతులకే అందించాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కౌలు రైతుల నుంచి అర్జీలను స్వీకరించి రెవెన్యూ, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన కౌలు రైతులను గుర్తించాలన్నారు. వారందరికీ పెట్టుబడి సాయంగా రూ.20వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో కౌలురైతుసంఘం నాయకులు కల్లూరి రామారావు, వై రాధాకృష్ణ, గోగడ హరిబాబు, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు కృష్ణ తదితరులు ఉన్నారు.




బారికేడ్లు అందజేసిన దాతలు, ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్

పెదకాకాని ఆలయానికి బారికేడ్లు వితరణ

● ఇర్లపాడు వాసికి ఉప కమిషనర్ లీలాకుమార్ అభినందనలు

పెదకాకాని, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానానికి క్యూ లైన్లుగా వినియోగించేందుకు పల్నాడు జిల్లా, శావల్యాపురం మండలం, ఇర్లపాడు గ్రామానికి చెందిన ఆరుమళ్ళ వెంకటరావు, అనూష కుటుంబ సభ్యులు కలిసి జింకు పైపులతో చేసిన లక్ష రూపాయలు విలువ చేసే 25 బారికేడ్లు అందజేసినట్లు దేవస్థానం ఉప కమిషనర్ లీలాకుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా లీలా కుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.



స్విమ్మింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

స్విమ్మింగ్ పోటీలలో విన్నర్ ఎన్టీఆర్ జిల్లా

నరసరావుపేట కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) రెండ్రోజుల పాటు పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఏక్వాటిక్ ఛాంపియన్ షిప్ స్విమ్మింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. అపా ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ విన్నర్‌గా ఎన్టీఆర్ జిల్లా కైవసం చేసుకోగా, రన్నర్‌అప్‌గా కర్నూలు జిల్లా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. కాగా పురుషుల ఇండివిడ్యువల్ ఛాంపియన్ షిప్‌ను ఎం.శరత్ గెల్చుకోగా, అమ్మాయిల ఇండివిడ్యువల్ ఛాంపియన్ షిప్‌ను శాన్వి కొంగర, యు.ప్రేమామృత సంయుక్తంగా గెలుచుకున్నట్లు చెప్పారు. పోటీలలో పాల్గొన్న అపా ఛైర్మన్ డాక్టర్ కొంగర రవికాంత్ మాట్లాడుతూ ఈ పోటీలను పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ వారు విజయవంతంగా నిర్వహించారని అభినందించారు. అపా ప్రెసిడెంట్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పోటీలకు వచ్చిన వారికి పల్నాడు స్విమ్మింగ్ అసోసియేషన్ నిర్వాహకులు మంచి భోజన వసతి కల్పించారన్నారు. విజేతలకు అపా ఛైర్మన్ ఇతర కార్యవర్గం చేతుల మీదుగా షీల్డ్, బహుమతులు అందజేశారు. పల్నాడు స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలను నిర్వహించే అవకాశం కల్పించినందుకు అపా కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన విజేతలు ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏవీవీ రామలింగారెడ్డి, ట్రెజరర్ వైవీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

బొల్లాపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరికొండపాలెం తండా యూత్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిశాయి. టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి సాధించిన వారికి రూ.15వేలు, ప్రణవి గ్రూప్ ఆఫ్ చైర్మన్ విష్ణుమూర్తి నాయక్ రెండో బహుమతి కింద రూ.7వేలును అందించారు. కార్యక్రమంలో ప్రణవీ గ్రూపు ఆఫ్ చైర్మన్ విష్ణుమూర్తి నాయక్, ఆల్ ఇండియా బంజార సేవా సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్ నాయక్, వినుకొండ టౌన్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు నాయక్, డాక్టర్ కోటేష్ నాయక్, రంగా నాయక్, క్రికెట్ టీమ్ సభ్యులు, గ్రామస్థులు, క్రికెట్ యూత్ తదితరులు పాల్గొన్నారు.